


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 350, పేజీలు - 08

బుధవారం, జూన్ 10, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# తొలకరి జల్లు.. రోడ్లన్నీ ఫుల్లు

**- తెలంగాణకు రెండ్రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ**

**- ఈదురుగాలులకు కూలిన చెట్లు, నిలిచిన విద్యుత్ సరఫరా**

**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నైరుతి రుతుపవనాల రాకతో హైదరాబాద్ మహానగరంలో కురిసిన తొలి భారీ వర్షం నగరవాసులను అతలాకుతలం చేసింది. ఎండ వేడిమి నుంచి ఉపశమనం లభించిందని సంతోషించే లోపే ఈ ఈదురుగాలుల వాన నగర ట్రాఫిక్ వ్యవస్థను పూర్తిగా చెల్లాచెదురు చేసింది. మంగళవారం సాయంత్రం ఆఫీసులు ముగిసే సమయానికి ఒక్కసారిగా విరుచుకుపడిన కుండపోత వర్షం కారణంగా ప్రధాన రహదారులన్నీ చెరువులను తలపించాయి. రోడ్లపై భారీగా నీరు చేరడం, పలు ప్రాంతాల్లో ఈదురుగాలుల ధాటికి పెద్ద పెద్ద చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి వాహనదారులు నరకం చూశారు.ఐటీ కారిడార్ పరిధిలోని మాధాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, రాయదుర్గం, ఐకియా జంక్షన్ పరిసర ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. వర్షం తీవ్రతకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఒక్కసారిగా మెట్రో స్టేషన్ల కింద, ఫ్లైఓవర్ల కింద ఆశ్రయం పొందారు. దీనివల్ల రోడ్లు మరింత ఇరుకుగా మారి బాటిల్ నెక్ సమస్యలు తలెత్తాయి. అటు పంజాగుట్ట, బేగంపేట్, లక్డీకాపూల్, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ముషీరాబాద్, రామ నగర్ వంటి రద్దీ మార్గాల్లో ఎటు చూసినా వాహనాల రెడ్ టైల్‌లైట్లే దర్శనమిచ్చాయి. ఆఫీసుల నుంచి ఇళ్లకు చేరడానికి సాధారణంగా పట్టే సమయం కంటే మూడు నుండి నాలుగు రెట్లు ఎక్కువ సమయం పట్టిందని నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా తమ ఆవేదనను పంచుకున్నారు.

వర్షం కారణంగా రహదారులపై ఉన్న గుంతలు, మ్యాన్‌హోల్స్ నీట మునగడంతో ప్రమాదాలు జరగకుండా వాహనదారులు తమ వాహనాల వేగాన్ని గణనీయంగా తగ్గించారు. ఈ స్లో మూవింగ్ ట్రాఫిక్ వల్ల నగరంలోని కీలక జంక్షన్లలో గంటల తరబడి వాహనాలు ఇంచు కూడా కదల్లేని స్తంభన ఏర్పడింది. ముషీరాబాద్, రామ్‌నగర్, హైదర్‌గూడ ప్రాంతాల్లో భారీ వృక్షాలు రోడ్డుపై కూలడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి హైదరాబాద్, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు భారీ వర్షంలోనూ రోడ్లపైనే ఉండి శ్రమించాల్సి వచ్చింది. చంద్రాయణ గుట్ట వద్ద వర్షం కారణంగా విద్యుత్ వైర్లు తెగిపడి కరెంట్ షాక్ తగిలి ఇద్దరు యువకులు చనిపోయారు.ఈ విపత్కర పరిస్థితుల్లో జీహెచ్ఎంసీ, హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సిబ్బంది తక్షణమే రంగంలోకి దిగారు. నీరు నిలిచిన సుమారు 140కి పైగా ముంపు ప్రాంతాల్లో వాటర్ లాగింగ్‌ను క్లియర్ చేయడానికి మోటార్లను రంగంలోకి దించారు. రోడ్లపై కూలిన చెట్లను ఎమర్జెన్సీ గ్యాంగ్‌ల సాయంతో కట్ చేసి పక్కకు తొలగించారు. రాబోయే రెండు రోజులు నగరానికి ఎల్లో అలర్ట్ ప్రకటించినందున, అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరించారు.

## కీర్తి చక్ర పురస్కార ప్రదానోత్సవాల్లో

# భావోద్వేగ దృశ్యాలు

**కన్నీరు పెట్టుకున్న అమరవీరుడి తల్లికి రాష్ట్రపతి ఆత్మీయ ఓదార్పు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రాష్ట్రపతి భవన్ వేదికగా సోమవారం జరిగిన రక్షణ శాఖ వీరుల పతకాల ప్రదానోత్సవం 2026 ఒక అద్భుతమైన, భావోద్వేగ ఘట్టానికి సాక్ష్యంగా నిలిచింది. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమర జవాన్ సిపాయి జంజాల్ ప్రవీణ్ ప్రభాకర్ శౌర్యానికి గుర్తుగా కేంద్ర ప్రభుత్వం ఆయనకు మరణానంతరం దేశ రెండో అత్యున్నత శాంతిసమయ వీరత్వ పురస్కారం కీర్తి చక్ర ను ప్రకటించింది.

2లో..

# వృద్ధి రేటు పెంపుపై ఫోకస్

**- పనితీరు ఆధారంగా శాఖలకు స్కోరింగ్**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు, వృద్ధి రేటును పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాచరణ ప్రారంభించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) లక్ష్యాలు, ప్రభుత్వ శాఖల పనితీరును కొలిచే కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల (కేపీఐ)పై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో వివిధ శాఖలకు కేపీఐలను సీఎం నిర్దేశించారు. జాతీయ సగటు కంటే వెనుకబడిన సూచికలను మెరుగుపరచడమే కాకుండా, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు. కేవలం నిర్దేశిత లక్ష్యాలే కాకుండా, వాస్తవ వృద్ధి (రియల్ గ్రోత్) ఆధారంగా శాఖల పనితీరును అంచనా వేసేందుకు స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని సీఎం నిర్ణయించారు.రాష్ట్ర, క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను ఎప్పటికప్పుడు విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మౌలిక

2లో..

# దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

**- రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై, కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన అహంకారం, అభద్రతా భావం, తీవ్ర నిరాశతోనే రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు, తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. "కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందంటే అది రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీల దయాదాక్షిణ్యాల వల్లేమీ కాదు. నేను అంబర్‌పేట్, సికింద్రాబాద్ ప్రజల ఆశీస్సులతో ఢిల్లీకి వెళ్లాను. రేవంత్ రెడ్డికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. తెలంగాణ ప్రజలకు, నా నియోజకవర్గానికి, నా పార్టీకి మాత్రమే నేను జవాబుదారీని" అని స్పష్టం చేశారు.తెలంగాణ అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. "రేవంత్ రెడ్డికి దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి. ప్రెస్ క్లబ్ అయినా సరే లేదా అమరవీరుల స్తూపం ముందైనా సరే నేను చర్చకు సిద్ధం" అని ప్రకటించారు. తాను తెలంగాణకు రావాల్సిన ఏ ఒక్క ప్రాజెక్టునైనా అడ్డుకున్నానని నిరూపిస్తే తక్షణమే రాజీనామా చేస్తానని, దీనిపై సీనియర్ జర్నలిస్టులతో ఒక కమిటీని వేసి విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, మెట్రో ఫేజ్-2 పై సీఎం చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయ

2లో..

# 2034 వరకు కాంగ్రెస్ దే అధికారం

**- మహిళలు వ్యాపార ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆడబిడ్డలతో పెట్టుకున్నవారెవరైనా అధికారంలో ఉంటారా? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మహిళల పెట్టిన వాతలకు అధికారం దిగిపోయి కొందరు ఫామ్ హౌస్ పడుకుని ఏడుస్తున్నారన్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4 వేల కోట్లు సున్నావడ్డీని ఎగొట్టి పోయిందని దాని ఫలితంగా నేడు ప్రతిపక్షానికి పరిమితం అయ్యింది అని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన మహిళా శక్తి మహాసభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నాం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణను పదేళ్లు పరిపాలించిన బీఆర్ఎస్ ఏనాడు తమ పార్టీకి అధ్యక్షురాలిగా మహిళలను నియమించలేదు అని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకూ కూడా మంత్రి పదవి ఇవ్వలేదు అని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు.

2లో..

## బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని

# దివాలా తీయించింది

**- మా ప్రభుత్వం 18 గంటలు కష్టపడుతుందన్న భట్టి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ నాయకులపై, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వరంగల్ జిల్లా చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం

2లో..

# పాకిస్థాన్ కు చుక్క నీరు కూడా ఇవ్వం

**- భారత్ మరోసారి సంచలనం**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్- పాకిస్థాన్ మధ్య ఏళ్లుగా సాగుతున్న ఉద్రిక్తతలు గతేడాది పహల్గామ్ ఉగ్రదాడి కారణంగా రెట్టింపయ్యాయి. గతేడాది ఏప్రిల్ 22 న జమ్మూకాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ఈ దాడుల వెనుక ఉన్నట్లు గ్రహించిన భారత్ మే 7 నుంచి 10 మధ్య ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లో 9 కీలక ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. వందలాదిమంది ఉగ్రవాదులను హతమార్చింది. అయితే కేవలం పాకిస్థాన్ పై దాడులే కాకుండా దౌత్య పరంగా, ఆర్థిక పరంగా అత్యంత కఠినమైన వ్యూహాత్మక నిర్ణయాలను తీసుకుంది.అయితే భారత్ తీసుకున్న నిర్ణయాల్లో

2లో..

# జనాభాను తగ్గిస్తున్న స్మార్ట్ ఫోన్లు

**- పరిశోధనల్లో షాకింగ్ నిజాలు!**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రపంచవ్యాప్తంగా సాధారణంగా జీవన ప్రమాణాలు మెరుగైనప్పుడు లేదా ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పుడు జననాల రేటు తగ్గడం సహజం. కానీ గత రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా ఒక వింత ధోరణి కనిపిస్తోంది. దేశాల ఆర్థిక, సామాజిక పరిస్థితులతో సంబంధం లేకుండా 2007 తర్వాత అన్ని చోట్లా ఒకేలా సంతానోత్పత్తి

2లో..

# మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ

**- కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) మధ్యప్రదేశ్ రాజ్యసభ ద్వివార్షిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ తరఫున ఏకైక అభ్యర్థిగా బరిలో ఉన్న మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాలను

2లో..

## వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంపై

# విచారణకు త్రిసభ్య కమిటీ

**- ప్రమాద ఘటనాస్థలిని పరిశీలించిన పవన్ కళ్యాణ్**

**- బాధితులకు పరిహారం ప్రకటించిన పవన్**



విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో సోమవారం జరిగిన ప్రమాదం పలు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ప్రమాదం నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విశాఖలో పర్యటించారు. ఘటనాస్థలిని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన పవన్ కళ్యాణ్.. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి కార్మికుని కుటుంబానికి రూ. 25 లక్షల చొప్పున తక్షణ పరిహారంతోపాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ప్లాంట్లో ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని తెలిపారు. పర్మినెంట్ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ

2లో..

## కీర్తి చక్ర పురస్కార ప్రదానోత్సవాల్లో

# భావోద్వేగ దృశ్యాలు

ఈ అవార్డును అందుకోవడానికి ఆయన తల్లి వేదికపైకి రాగా, అక్కడ ఒక్కసారిగా భావోద్వేగాలు మిన్నంటాయి.అవార్డుల ప్రదానోత్సవంలో సిపాయి ప్రవీణ్ ప్రభాకర్ పేరును ప్రకటించగానే, ఆ వీరమాత భారమైన అడుగులతో వేదిక వైపు నడిచారు. తన కన్నకొడుకు దేశం కోసం చేసిన సర్వోన్నత త్యాగాన్ని తలచుకుంటూ ఆమె వేదికపైనే వెక్కివెక్కి ఏడ్చారు. ఆ తల్లి కన్నీళ్లను చూసి చలించిపోయిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి స్వయంగా ముందుకు వచ్చారు. ఆ వీరమాత చేతులను తన చేతుల్లోకి తీసుకుని, ఆమెను హత్తుకుని ఓదార్చారు. రాష్ట్రపతి చూపిన ఈ మానవీయ కోణం అక్కడున్న సీనియర్ సైనిక అధికారులు, కేంద్ర మంత్రులు , ఇతర అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యుల కళ్లను తడి చేశాయి. మహార్ రెజిమెంట్‌కు చెందిన సిపాయి ప్రవీణ్ ప్రభాకర్, రాష్ట్రీయ రైఫిల్స్ బెటాలియన్‌లో సేవలు అందించారు. జూలై 6, 2024న జమ్మూ కాశ్మీర్‌లోని కుల్గామ్ పరిధిలో జరిగిన ఒక భారీ యాంటీ-టెర్రర్ ఆపరేషన్‌లో ఆయన వీరమరణం పొందారు. ఆ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న పక్కా సమాచారంతో పాటు, కొంతమంది పౌరులను వారు బందీలుగా చేసుకున్నారన్న వార్తతో ప్రవీణ్ బృందం రంగంలోకి దిగింది. భీకరంగా సాగిన ఈ ఎదురుకాల్పుల్లో ప్రవీణ్ అత్యంత సాహసంతో శత్రువుల తూటాలను ఎదుర్కొంటూ ముందుకు దూకారు.తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, ఉగ్రవాదుల తుపాకీ గుళ్లకు ఎదురొడ్డి నిలిచిన ప్రవీణ్.. అత్యంత సమీపం నుండి ఇద్దరు కరడుగట్టిన ఉగ్రవాదులను మట్టుబెట్టారు. ఈ క్రమంలో కాల్పుల తీవ్రత ఎక్కువవడంతో, ఒక పౌరుడి ప్రాణాలను కాపాడేందుకు తన శరీరాన్ని అడ్డుగా పెట్టి రక్షణ కవచంగా నిలిచారు. తీవ్ర గాయాలైనప్పటికీ శ్వాస ఉన్నంతవరకు పోరాడి, పౌరుడిని సురక్షితంగా రక్షించి, ఆ తర్వాత రణభూమిలోనే కన్నుమూశారు. ప్రవీణ్ ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలు, విధి నిర్వహణ పట్ల ఉన్న అంకితభావం రాబోయే తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి అని అధికారిక ప్రశంసా పత్రంలో కొనియాడారు.ఈ ప్రతిష్టాత్మక అవార్డుల ప్రధానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మొత్తం 51 గ్యాలంట్రీ అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో 7 కీర్తి చక్రాలు రెండు మరణానంతరం , 15 వీర చక్రాలు, 29 శౌర్య చక్రాలు ఉన్నాయి. ఈ వేడుకలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ 'గగన్‌యాన్' మిషన్‌కు ఎంపికైన వ్యోమగామి, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కీర్తి చక్ర పురస్కారాన్ని అందుకోగా అత్యంత ఎత్తైన పర్వత ప్రాంతాల ఆపరేషన్‌లో వీరోచితంగా పోరాడి అమరుడైన సిక్కిం స్కౌట్స్‌కు చెందిన లెఫ్టినెంట్ శశాంక్ తివారీకి కూడా మరణానంతరం కీర్తి చక్రతో గౌరవించారు.

## దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

ఆమోదం తెలిపిందని వెల్లడించారు. తుమ్మిడిహట్టి అపాయింట్‌మెంట్ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ఆధారాలు లేని ఆరోపణలు మానేసి, పద్ధతిగా అధికారికంగా అపాయింట్‌మెంట్ కోరాలని సూచించారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ అవినీతి, తప్పుడు నిర్వహణతో మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

## బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దివాలా తీయించింది

అహర్నిశలు శ్రమిస్తుంటే హరీష్ రావు మాత్రం అబద్ధాలు ప్రచారం చేయడంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. "రాష్ట్ర క్యాబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తుంటే హరీష్ రావు నిత్యం అబద్ధాలు చెబుతున్నారు" అని భట్టి విమర్శించారు.పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకుని, దివాలా తీయించిందని ఆయన ఆరోపించారు. మరి నాడు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వ విజయాలను ఆయన పంచుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే 76,000 ప్రభుత్వ ఉద్యోగాలు అందించిందని, రైతులకు అండగా నిలుస్తూ తడిసిన, దెబ్బతిన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తోందని తెలిపారు. అలాగే రుణమాఫీ పథకాన్ని నిలకడగా అమలు చేస్తున్నామని చెప్పారు.బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన దేవాదుల ప్రాజెక్టును తాము వేగవంతం చేశామన్నారు. గత ప్రభుత్వం డిస్కమ్‌లకు బకాయిలు పెట్టడం వల్లే విద్యుత్ సమస్యలు వచ్చాయని, తాము ఆ బకాయిలను చెల్లిస్తూ విద్యుత్ సరఫరాను మెరుగుపరిచామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నామని చెప్పారు. రఘునాథపల్లిలో 230 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

# 2034 వరకు కాంగ్రెస్ దే అధికారం

### దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించిన కాంగ్రెస్

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళాభివృద్ధి, మహిళా సంక్షేమం, మహిళా భద్రత వంటి అంశాలకు పెద్దపీట వేస్తోంది అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చినట్లు చెప్పుకొచ్చారు. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పడితే భారత్?కు స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ దక్కిందని కొనియాడారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కింది అని చెప్పుకొచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4వేల కోట్లు సున్నావడ్డీని ఎగొట్టి పోతే తమ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలనే తపనతో పనిచేస్తోంది అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

### ఉచిత బస్సుతో ఆడపిల్లల డ్రాపౌట్స్

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్ సదుపాయం కల్పిస్తే కొంతమంది కడుపునొప్పితో ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.ఆటో డ్రైవర్లతో ధర్నాలు చేయించి ఆడబిడ్డలకు ఉచిత బస్సు పథకం ఆపేందుకు కడుపులో విషం, కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉచిత బస్సుతో ఆడపిల్లల డ్రాపౌట్స్ తగ్గాయని సీఎం చెప్పుకొచ్చారు. ఉచిత బస్సు పథకం కోసం ఇప్పటి వరకు రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### 2034 వరకు అధికారం మనదే

తెలంగాణ ఆర్థిక ప్రగతి ఆడబిడ్డల చేతుల్లో ఉంది అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలను కోటీశ్వరులను చేసే వరకు విశ్రమించేదే లేదని మీకు ఏం కావాలన్నా చేయడానికి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మీ సోదరుడు ఉన్నాడని చెప్పుకొచ్చారు. రాబోయే రోజుల్లో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి వస్తానని వ్యాపార ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ సరఫరా అంతా మహిళలకు అప్పగించే బాధ్యత నేను తీసుకుంటాన్నారు. దళారులు, దోపిడీదారులు, కమిషన్ ఏజెంట్లకు ఈ ప్రభుత్వంలో స్థానం లేదని చెప్పుకొచ్చారు. మహిళల ఆశీర్వాదంతో 2034 వరకు అధికారంలో మేము ఉంటామని అన్నారు. మీకు అండగా ఉండే బాధ్యత నాది, మంత్రి సీతక్కది అని చెప్పుకొచ్చారు.మహిళా సంఘాలు కొనుగోలు చేసే బస్సులు ఆర్టీలో పెట్టుకునే బాధ్య ఈ ప్రభుత్వానిదని చెప్పుకొచ్చారు. అంబానీలు చేసే వ్యాపారం మహిళల చేత చేయిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### 553 కొత్త ఆర్టీసీ బస్సుల ప్రారంభం

మరోవైపు భారీ వర్షం ముంచెత్తినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడా కూడా వెనక్కి తగ్గలేదు. హోరు వానలో కూడా కార్యక్రమాన్ని నిర్వహించారు. కుండపోత వర్షంలోనూ తన సహచర మంత్రులతో కలిసి వేదికపైకి చేరుకున్న ముఖ్యమంత్రి, మహిళా స్వయం సహాయక సంఘాల కోసం కేటాయించిన 553 కొత్త ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు.అనంతరం ఆయన జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు.

ఆ తర్వాత స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన హైర్ ఛార్జీల చెక్కులను పంపిణీ చేశారు. 'ఇందిరా మహిళా శక్తి' వంటి వినూత్న పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ పథకంలో భాగంగా మహిళా సంఘాలు కొనుగోలు చేసిన బస్సులను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు (టీఎస్ఆర్టీసీ) లీజు ప్రాతిపదికన అందజేస్తారు.

# వృద్ధి రేటు పెంపుపై ఫోకస్

సదుపాయాలపై పెట్టే వ్యయం, ఆర్థిక కార్యకలాపాలను 3.5 రెట్లు పెంచేలా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఆర్థిక వ్యవహారాలను రియల్ టైంలో పర్యవేక్షించేందుకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలనే ఆలోచనను కూడా పంచుకున్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా ఆధారిత పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. అమరావతి, పోలవరం, పోర్టులు, ఎయిర్‌పోర్టుల వంటి కీలక ప్రాజెక్టులతో ఆర్థిక వ్యవస్థకు 'మల్టిప్లైయర్ ఎఫెక్ట్' తీసుకురావాలని సూచించారు. కేపీఐలు మెరుగ్గా ఉంటేనే రాష్ట్ర వృద్ధి రేటు పెరుగుతుందని, ప్రతి రంగంలోనూ గ్రాస్ వాల్యూ అడిషన్ (జీవీఏ) పెంపుపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి అన్నారు.

## వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంపై

# విచారణకు త్రిసభ్య కమిటీ

ప్రయోజనాల కింద రూ. 1.72 కోట్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ. 45.75 లక్షలు అందిస్తామని, గాయపడినవారి వైద్యానికి అయ్యే మొత్తం ఖర్చులను స్టీల్ ప్లాంట్ యాజమాన్యమే పూర్తిగా భరిస్తుందన్నారు.విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాద ఘటనపై బొకారో స్టీల్ ప్లాంటుకు చెందిన త్రిసభ్య కమిటీ దర్యాప్తు చేస్తుందని, కమిటీ అందించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చూస్తామన్న పవన్ కళ్యాణ్.. మరణించిన కార్మికుల పిల్లల చదువులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ప్రమాదంలో మరణించిన ఉద్యోగికి పదవీ విరమణ వయసు వరకూ, వారి కుటుంబ సభ్యులు ప్రస్తుతం ఉంటున్న స్టీల్ ప్లాంట్ క్వార్టర్లలోనే ఉచితంగా ఉండొచ్చని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇక ఘటన స్థలంలో కార్మికులతో మాట్లాడానన్న పవన్ కళ్యాణ్ సరైన భద్రతా ప్రమాణాలు పాటించలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఆధునీకరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందని, దశాబ్దాల నాటి పాత పరికరాలు, యంత్రాలను మార్చకుండా వాడటం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారని వెల్లడించారు. గత 36 ఏళ్ల స్టీల్ ప్లాంట్ చరిత్రలో ఇలాంటి ఘటన ఎప్పుడూ జరగలేదని పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో చిన్నపాటి లీకేజీలు, ఇతర ప్రమాదాలు జరిగినప్పటికీ, ల్యాడిల్ బకెట్ పేలిపోవడం ఇదే మొదటిసారని అన్నారు. ఈ రకమైన పేలుడు అత్యంత అరుదైనదన్న డిప్యూటీ సీఎం త్రిసభ్య కమిటీ ప్రమాదం జరిగిన స్టీల్ మెల్టింగ్ షాప్ విభాగాన్ని పరిశీలిస్తుందన్నారు. ద్రవ ఉక్కును తరలించే లాడెల్ బకెట్ స్లైడ్ గేట్ తెరవకముందే పేలుడు ఎందుకు సంభవించింది? ఇది సాంకేతిక లోపమా? ఇంకేదైనా సమస్య? ఇలా అన్ని కోణాల్లో కమిటీ దర్యాప్తు జరుపుతుందని పవన్ కళ్యాణ్ ప్రకటించారు.అలాగే విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు, యాజమాన్య లోపాలు వంటి అంశాలపై త్వరలోనే కార్మిక సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామని పవన్ కళ్యాణ్ తెలిపారు. స్టీల్ ప్లాంటులో ఏం జరుగుతుందో క్షేత్రస్థాయిలో పనిచేసే కార్మిక సంఘాల నేతలతో మాట్లాడి తెలుసుకుంటానని వెల్లడించారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలనేదే కూటమి ప్రభుత్వం ఆకాంక్ష అని చెప్పిన పవన్ కళ్యాణ్ కార్మిక సంఘాలు రాజకీయాలకు అతీతంగా పని చేసినప్పుడే కార్మికులకు నిజమైన న్యాయం జరుగుతుందని అన్నారు.

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ

రిటర్నింగ్ అధికారి మంగళవారం తిరస్కరించారు. తెలంగాణ కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఒక కేసుకు సంబంధించిన సమాచారాన్ని ఆమె ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారంటూ బీజేపీ లేవనెత్తిన అభ్యంతరంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్ కోర్టులో మీనాక్షి నటరాజన్‌పై ఒక పిటిషన్ దాఖలైంది. లైంగిక వేధింపులు, ప్రాణహాని బెదిరింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి మీనాక్షి రాజకీయ అండదండలు అందించారని ఎ.శ్రీలత అనే మాజీ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఈ విషయాన్ని నామినేషన్‌లో ప్రస్తావించలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది.అయితే, బీజేపీ ఆరోపణలను కాంగ్రెస్ నేత ఉమంగ్ సింఘార్ "బలవంతపు రాజకీయాలు"గా అభివర్ణించారు. మీనాక్షిపై ఎలాంటి కేసు నమోదు కాలేదని, కేవలం కోర్టు నుంచి నోటీసు మాత్రమే అందిందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కేసు నమోదైతేనే వివరాలు వెల్లడించాలి తప్ప, నోటీసుకు కాదని వాదించారు. ఇదంతా తన ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు చేస్తున్న రాజకీయ కుట్ర అని మీనాక్షి నటరాజన్ అన్నారు. "ఒక గాంధేయవాద మహిళను చూసి బీజేపీ భయపడుతోంది" అని ఉమంగ్ సింఘార్ ఎక్స్ వేదికగా విమర్శించారు. "వారి నినాదం 'నారీ వందన్', కానీ నైజం 'నారీ అపమాన్'.. ఇదే బీజేపీ అసలు స్వరూపం" అని దుయ్యబట్టారు. సత్యం, రాజ్యాంగం, ప్రజాభిప్రాయం శక్తితో తాము విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మీనాక్షి నటరాజన్ ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జిగా కొనసాగుతుండడం తెలిసిందే.

## పాకిస్థాన్ కు చుక్క నీరు కూడా ఇవ్వం

1960 నాటి సింధూ నది జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం అత్యంత ప్రధానమైనది. రక్తం నీరు కలిసి ప్రవహించలేవు అని భారత్ క్లియర్ గా స్పష్టం చేసింది. అయితే తాజాగా ఇదే వివాదంపై కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో పాకిస్థాన్ కు సింధూ నది వ్యవస్థ నుంచి ఒక్క చుక్క నీరు కూడా వెళ్లకుండా ప్రధాని మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అయితే 1960 నాటి ఈ ఒప్పందం పూర్తిగా రద్దు చేయలేదని ప్రస్తుతం దానిని తాత్కాలిక నిలిపివేతలో ఉంచినట్లు స్పష్టం చేశారు.ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వయంగా ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్నారు.

సరిహద్దుల్ని దాటి పాకిస్థాన్ కు వెళ్లే నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడానికి టైమ్ బౌండ్ పద్ధతిలో పనులు వేగంగా జరుగుతున్నాయని.. రాబోయే సంవత్సరాల్లో ఒక్క చుక్క నీరు కూడా పాకిస్థాన్ కు వెళ్లదని మంత్రి సీఆర్ పాటిల్ పేర్కొన్నారు. ఇక ఇదే విషయంపై తాజాగా భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం కింద ఏర్పాటైన ఆర్బిట్రేషన్ కోర్టు అధికార పరిధిని భారత్ తోసిపుచ్చింది. అది చట్టవిరుద్ధంగా ఏర్పడిన కోర్టు అని ఆ కోర్టు తీర్పులను భారత్ గుర్తించదని పేర్కొన్నారు. ఈ మేరకు కిషన్ గంగ, రాట్లే హైడ్రో పవర్ ప్రాజెక్టుల విషయంలో పాకిస్థాన్ అభ్యంతరాలను భారత్ అంగీకరించడం లేదని పేర్కొన్నారు.ఇక భారత్ తీసుకున్న నిర్ణయంతో పాకిస్థాన్ లో నీటి సంక్షోభం తలెత్తింది. ఆ దేశంలో నీటి లభ్యతపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. పాకిస్థాన్ ఆర్థిక రాజధాని కరాచీ నగరంలో ఇప్పటికే తీవ్రమైన నీటి కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. నగరంలోని దాదాపు 70 శాతం ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దాంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# జనాభాను తగ్గిస్తున్న స్మార్ట్ ఫోన్లు

రేటు పడిపోతోంది. దీనికి గల కారణాలపై అమెరికాకు చెందిన 'నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్ రీసెర్చ్', సిన్సినాటి విశ్వవిద్యాలయం చేసిన రెండు తాజా పరిశోధనల్లో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. మనం వాడుతున్న 'ఐఫోన్' లేదా స్మార్ట్‌ఫోన్లు ఈ జనాభా తగ్గుదలకు ఓ ప్రధాన కారణమని అధ్యయనాలు తేల్చాయి.అమెరికాలో 1980 నుంచి 2007 వరకు ప్రతి వెయ్యి మంది మహిళలకు 65 నుంచి 70 ప్రసవాలు జరుగుతూ స్థిరంగా ఉండేవి. కానీ 2007 తర్వాత ఈ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోతూ వచ్చి 2024 నాటికి 54కు చేరుకుంది. అంటే దాదాపు 17 ఏళ్లలో 22 శాతం క్షీణత నమోదైంది. దీనికి 2008 నాటి ఆర్థిక మాంద్యం కారణమని మొదట్లో భావించినప్పటికీ.. ఆ తర్వాత ఆర్థిక వ్యవస్థ పుంజుకున్నా జననాల రేటు మాత్రం పెరగలేదు. దీంతో పరిశోధకులు 2007లో సరిగ్గా ఐఫోన్ విడుదలైన సమయాన్ని ఆ తర్వాత మారిన డిజిటల్ విప్లవాన్ని పరిశీలించారు.ఆరంభంలో (2007-2011) అమెరికాలో ఐఫోన్ కేవలం 'ఏటీఅండ్‌టీ నెట్‌వర్క్ ఉన్న ప్రాంతాల్లోనే లభించేది. ఈ అవకాశాన్ని పరిశోధకులు ఒక ప్రయోగంగా తీసుకుని ఈ నెట్‌వర్క్ ఉన్న కౌంటీలను, లేని కౌంటీలతో పోల్చి చూశారు. ఐఫోన్ నెట్‌వర్క్ విరివిగా ఉన్న ప్రాంతాల్లో 15 నుంచి 19 ఏళ్ల యువతుల్లో ప్రసవాల రేటు 4.5 నుంచి 8 శాతం వరకు, అలాగే 20 నుంచి 24 ఏళ్ల మహిళల్లో 3.2 నుంచి 6.6 శాతం వరకు తగ్గినట్లు గుర్తించారు. ఈ గణాంకాలను బట్టి 2007-2011 మధ్య కాలంలో అమెరికాలో తగ్గిన మొత్తం జనాభా రేటులో 33 నుంచి 52 శాతానికి ఐఫోన్ లేదా స్మార్ట్‌ఫోన్ వాడకమే కారణమని తేలింది.స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత యువత ఒకరినొకరు నేరుగా కలుసుకోవడం, స్నేహితులతో సమయం గడపడం భారీగా తగ్గించేశారు. 2003లో రోజుకు సగటున 68 నిమిషాలుగా ఉన్న ప్రత్యక్ష సామాజిక సంబంధాలు.. 2019 నాటికి కేవలం 38 నిమిషాలకు (44 శాతం) పడిపోయాయి. అదే సమయంలో కంప్యూటర్లు, ఫోన్ల స్క్రీన్ల ముందు గడిపే సమయం 22 నిమిషాల నుంచి 96 నిమిషాలకు (336 శాతం) పెరిగింది. దీనివల్ల భాగస్వాముల మధ్య శారీరక సంబంధాలు తగ్గడం, మరోవైపు అశ్లీల చిత్రాల వీక్షణ విపరీతంగా పెరిగిందని పరిశోధకులు తేల్చారు. అలాగే ఫోన్ల ద్వారా గర్భనిరోధక సాధనాలు, అబార్షన్లపై అవగాహన పెరగడం కూడా ఇందుకు దోహదం చేసింది.సిన్సినాటి విశ్వవిద్యాలయ ఆర్థికవేత్తలు వరల్డ్ బ్యాంక్ డేటాను ఉపయోగించి 128 దేశాల్లోని పరిస్థితులను అధ్యయనం చేశారు. వివిధ రకాల ఆరోగ్య వ్యవస్థలు, మతపరమైన సంప్రదాయాలు, చట్టాలు ఉన్న ఇరాన్, కోస్టారికా, మెక్సికో, టర్కీ, చిలీ వంటి దేశాల్లో కూడా స్మార్ట్‌ఫోన్ల వాడకం పెరిగిన తర్వాతే టీనేజ్ ప్రసవాల రేటు వేగంగా పడిపోయిందని కనుగొన్నారు. దీన్ని ఒక "గ్లోబల్ టెక్నాలజీ షాక్"గా వారు అభివర్ణించారు.ప్రస్తుతం ధనిక దేశాలతో పాటు అభివృద్ధి చెందుతున్న భారత్, బ్రెజిల్ వంటి మధ్యాదాయ దేశాల్లోనూ సంతానోత్పత్తి రేటు వేగంగా తగ్గుతోంది. 2024 నాటికి కెనడాలో ఈ రేటు 1.25కు పడిపోగా.. జపాన్, సింగపూర్, స్పెయిన్, దక్షిణ కొరియా దేశాలు ఇప్పటికే జనాభా క్షీణతతో అల్లాడిపోతున్నాయి. చైనా కూడా తన 'వన్ చైల్డ్' పాలసీని మార్చుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ స్మార్ట్‌ఫోన్ల యుగంలో మారుతున్న మనుషుల ప్రాధాన్యాలు, జీవనశైలే ప్రపంచవ్యాప్తంగా జనాభా సంక్షోభానికి దారితీస్తోందని ఈ పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

## యాక్సిడెంట్‌లో గాయపడిన టీడీపీ కార్యకర్తను పరామర్శించిన డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు



**బద్వేలు** బద్వేల్ పట్టణం 4వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త వంకెల శ్రీనివాసులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి మంగళవారం ఆయనను పరామర్శించారు.శ్రీనివాసులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సూర్యనారాయణ రెడ్డి గారు, ఆయనకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన వైద్య సేవలు అందేలా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తల సంక్షేమమే తమకు ముఖ్యమని, కష్టసుఖాల్లో కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. శ్రీనివాసులు పూర్తిగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డబ్బులు ఇచ్చుకో... నకిలీ పట్టా పుచ్చుకో..!

- **తిమ్మందొడ్డి గ్రామంలో నకిలీ ఇంటి పట్టాల కలకలం?**
- **అధికార పార్టీ గ్రామ నాయకుడే సూత్రధారి అంటూ ఆరోపణలు**
- **చనిపోయిన వ్యక్తి పేరుతోనూ పట్టాల సృష్టి!?**
- **నిద్రమత్తులో రెవెన్యూ అధికారులు**
- **బాధితుల తీవ్ర ఆగ్రహం**

**సి.బెళగల్** కర్నూలు జిల్లా సి.బెళగల్ మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో నకిలీ ఇంటి పట్టాల వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రభుత్వ భూములే లక్ష్యంగా, అమాయక ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని లక్షలాది రూపాయల చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "డబ్బులు ఇచ్చుకో.. నకిలీ పట్టా పుచ్చుకో" అనే చందంగా గ్రామంలో బహిరంగంగానే భూ అక్రమాలు జరుగుతున్నాయని గ్రామస్తులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ స్థలాలను అడ్డగోలుగా ఆక్రమించేందుకు కొందరు రాజకీయ నాయకులు, దళారులు చేతులు కలిపి నకిలీ పత్రాలను సృష్టిస్తున్న తీరు స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది.అసలు వివాదం ఏమిటి??గ్రామానికి చెందిన తెలుగు వెంకటేశ్వరమ్మ అనే మహిళకు గతంలో ప్రభుత్వం న్యాయబద్ధంగా ఇంటి పట్టా మంజూరు చేసింది. ఆర్‌సీ నెం. 135/85 కింద 20 ఫిబ్రవరి 1999న ఆమెకు 240-బి ప్లాట్‌ను ప్రభుత్వం కేటాయించింది. అప్పటి నుండి ఆ స్థలంపై ఆమె సర్వహక్కులు కలిగి ఉన్నారు. అయితే, ఇటీవల కాలంలో ఆ స్థలంపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది. అదే స్థలానికి బెస్త పెద్ద వెంకటరాముడు అనే వ్యక్తి పేరుతో మరొక నకిలీ పట్టాను సృష్టించి, తెలుగు వెంకటేశ్వరమ్మకు చెందిన స్థలాన్ని అక్రమంగా కబ్జా చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో బాధితురాలు ఆందోళనకు గురై న్యాయం కోసం గళమెత్తారు.? మరణించిన వ్యక్తి పేరిట పట్టా ఎలా వచ్చింది??ఈ నకిలీ పట్టాల వ్యవహారంలో ఒక విస్తుపోయే నిజం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలుగు వెంకటేశ్వరమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఏ వ్యక్తి పేరునైతే ఇప్పుడు నకిలీ పట్టా సృష్టించారో, ఆ బెస్త పెద్ద వెంకటరాముడు అనే వ్యక్తి 1980 సంవత్సరంలోనే మరణించారు.?"1980లోనే మరణించిన వ్యక్తి పేరుపై, తిరిగి 1999లో ప్రభుత్వ ఇంటి పట్టా ఎలా మంజూరు అవుతుంది? మరణించిన వ్యక్తి వచ్చి దరఖాస్తు చేసుకున్నాడా? లేక అధికారులు వచ్చి ఆయన సమాధి దగ్గర పట్టా ఇచ్చారా? దీనికి రెవెన్యూ అధికారులే సమాధానం చెప్పాలి" అని బాధితురాలు నిలదీశారు.?ఈ ఒక్క ఉదాహరణ చాలు గ్రామంలో ఏ స్థాయిలో నకిలీ పట్టాల దందా సాగుతుందో అర్థం చేసుకోవడానికి అని స్థానికులు పేర్కొంటున్నారు. సూత్రధారి ఆయనే.. గ్రామస్తుల సంచలన ఆరోపణలు?తిమ్మందొడ్డి గ్రామంలో సాగుతున్న ఈ నకిలీ పట్టాల దంద వెనుక ఓ బలమైన రాజకీయ హస్తం ఉందని గ్రామస్తులు నేరుగా ఆరోపిస్తున్నారు. గ్రామంలో అధికార పార్టీ నాయకుడిగా చలామణి అవుతున్న బి. సూర్యచంద్ర అనే వ్యక్తి ఈ వ్యవహారానికి ప్రధాన సూత్రధారి అని విమర్శలు వస్తున్నాయి.?అక్రమాల తీరు ఇలా ఉంది:?గ్రామంలో ఎక్కడైనా ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఉంటే చాలు, వాటిపై ఈ నాయకుడు కన్నేస్తాడు.?నిరుపేదలు, అమాయక ప్రజలను నమ్మించి, "మీకు ప్రభుత్వ స్థలం ఇప్పిస్తాం" అంటూ ఆశ చూపుతాడు.?ఒక్కో ఇంటి పట్టా సృష్టించడానికి రూ. 30 వేల నుండి రూ. 50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## నగరపాలక సంస్థకు 31 వినతులు

**- ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.**



**తిరుపతి** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 31 వినతులు వచ్చాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 21 మంది వినతులు సమర్పించగా, 10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా రాయల్ నగర్ లోని మా ఇంటి వద్ద ఉన్న చెట్టు వలన ఇబ్బంది గా ఉంది పరిష్కరిష్కరించాలని, వరదరాజ నగర్ లోని విశ్వం స్కూల్ ఉన్న రోడ్డు సగం నిర్మాణం చేసి ఆపారు పూర్తి చేయాలని, సంజయ్ గాంధీ కాలనీ లో స్థలం ఆక్రమించి కాంటీన్, కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేస్తున్నారు తగు చర్యలు తీసుకోవాలని, జూ పార్క్ రోడ్డు నందు తొలగించిన తోపుడు బండ్లు ఇప్పించాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, లక్ష్మీపురం కూడలి వద్దు రోడ్డు సమస్య పరిష్కరించాలని, రైతు బజార్, సుందరయ్య నగర్ దోభి కాలనీ, మధురనగర్ అక్కగార్ల గుడి వద్ద భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, సెక్రటరీ శ్రీవిద్య, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.

## ఇందుకూరు కాలేజీ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం దే

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నిమిత్తం పలు గ్రామాలను ప్రభుత్వ కార్యాలయాలను ఇందుకూరు ఇందుకూరుపేట పరిసర ప్రాంతాలకు తరలించడం జరిగినది దీనిలో భాగంగానే దేవీపట్నం లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇందుకూరు హైస్కూల్ నందు ఏర్పాటు చేయడం జరిగినది ఇదే హై స్కూల్ నందు కాలేజీ కొరకు నూతన బిల్డింగు నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి ఈ కాలేజీలో విద్యార్థులకు సీఈసీ, ఎంపీసీ, బైపిసి,,హెచ్ ఈ సి గ్రూపులకు విద్యార్థినీ విద్యార్థులకు విద్యాబోధన చేయడం జరుగుతుంది దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉండటం కోసం బాలురకు ప్రత్యేకంగా హాస్టల్ వసతి సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతున్నది ఈ వసతి సౌకర్యం ఏర్పాటు చేయడం వల్ల పేద విద్యార్థులకు దూర ప్రాంతంలో వెళ్లే ఇబ్బంది లేకుండా ఇక్కడే విద్యాభ్యాసం చేసి వసతి గృహం లో ఉండే సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందని, సీనియర్ అధ్యాపకులచే ఉత్తమ బోధన అందించడం జరుగుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు, హాస్టల్ వెల్ఫేర్ అధికారి పచ్చు కూరు అర్జునుడు తెలిపారు.

# శాటర్ డే.. నో బ్యాగ్ డే

**వరంగల్** తెలంగాణలోని పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ విద్యాశాఖ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఈసారి కేవలం చదువుకే పరిమితం కాకుండా విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్యాలెండర్‌లో పెద్దపీట వేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో.. క్యాలెండర్‌లోనే ప్రతిరోజూ క్రీడలు, ఆటలు నిర్వహించాలనే నిబంధనను విద్యాశాఖ పొందుపరిచింది.కొత్త నిబంధనల ప్రకారం.. పాఠశాలల్లో పిల్లలకు సాధారణ బోధనతో పాటు ప్రతిరోజూ క్రీడలు నిర్వహించాలి. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంచేందుకు కథల పుస్తకాలు, పత్రికలు, మ్యాగజైన్లు లాంటి వాటిని రోజుకు అరగంట పాటు చదివించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వీటితో పాటు, ప్రార్థన సమయంలో లేదా అది పూర్తయిన తర్వాత తరగతి గదిలో ఐదు నిమిషాల పాటు విద్యార్థులకు యోగా లేదా ధ్యానం చేయించటం తప్పనిసరి చేశారు.ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు మొత్తం 227 రోజుల పాటు పనిచేస్తాయి. పదో తరగతి సిలబస్‌ను 2027 జనవరి 10వ తేదీ నాటికి, మిగిలిన తరగతులకు ఫిబ్రవరి 28 నాటికి పూర్తి చేయాలని అధికారులు గడువు విధించారు. వచ్చే ఏప్రిల్ 23వ తేదీ పాఠశాలలకు చివరి పనిదినంగా ఉంటుంది. వచ్చే సంవత్సరం ఏప్రిల్ 24 నుంచి జూన్ 13వ తేదీ వరకు (2027) వేసవి సెలవులు ఉంటాయి. 2027 మార్చి 15 నుంచి చివరి పనిదినం వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. తొలిసారిగా ఈ ఒంటిపూట బడుల తేదీలను విద్యా క్యాలెండర్‌లోనే ముందుగా ప్రకటించడం విశేషం.ఇక ప్రతి నెలా మూడో శనివారం విద్యార్థులకు నో బ్యాగ్ డేగా అమలు చేస్తారు. అదే రోజున అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశాలు కూడా జరపాలి. 1 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు భోజన విరామం తర్వాత సెప్టెంబరు వరకు ప్రతిరోజూ ఒక సబ్జెక్టుపై ప్రత్యేకంగా రెమిడియల్ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. దీనివల్ల చదువులో వెనుకబడిన విద్యార్థులు సబ్జెక్టులపై అవగాహన పెంచుకునే అవకాశం లభిస్తుంది. కాగా.. మే 14న ప్రారంభమైన బడిబాట కార్యక్రమాన్ని ఈ నెల 19 వరకు కొనసాగించాలని విద్యాశాఖ ఆదేశించింది. అలాగే.. గత ఏడాది స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను 6 నుంచి 7కు పెంచగా.. ఈసారి మళ్లీ వాటిని 6కు తగ్గించారు. ఈ సమావేశాలు జులై, ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు, డిసెంబరు, ఫిబ్రవరి నెలల్లో జరుగుతాయి.విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు వివిధ సైన్స్ ప్రదర్శనల షెడ్యూల్‌ను క్యాలెండర్‌లో చేర్చారు. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025-26 జాతీయస్థాయి ఎగ్జిబిషన్‌ను అక్టోబరులో నిర్వహించనున్నారు. 2026-27 సంవత్సరానికి సంబంధించి జిల్లా స్థాయి పోటీలను నవంబరు లేదా డిసెంబరులో, రాష్ట్రస్థాయి పోటీలను డిసెంబరు లేదా జనవరిలో జరుపుతారు. సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ 2027 జనవరిలో నిర్వహించనున్నారు.

# రేవంత్ మైండ్ గేమ్‌లో కేసీఆర్

**హైదరాబాద్ :** కేసీఆర్ దమ్ముంటే అసెంబ్లీకి రావాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చ పెడదాం. ఒకవేళ ఆ చర్చలో నేను ఓడిపోతే అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ కు క్షమాపణలు చెబుతా" "వచ్చే ఎన్నికల్లో నా సంగతి చూస్తానంటున్న కేసీఆర్ కు పాలమూరు గడ్డపై సవాలు విసురుతున్నా. నిన్ను మళ్లీ మొలకెత్తనివ్వం. మీ పార్టీ జెండాలు ఎగరనివ్వం. గద్దెలు కూలుతాయి. పార్టీ గుర్తును మర్చిపోవాల్సిందే" "వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయం. జెడ్ ఎఫ్ టాప్.. కాంగ్రెస్ సర్కార్. కాంగ్రెస్ సర్కారు ఏర్పాటు తథ్యం. వచ్చే ఎన్నికల్లో ఆయన డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించిన ఊళ్లలో కేసీఆర్ ఓట్లు అడగాలి. నేను ఇందిరమ్మ ఇళ్లు కట్టిన ఊళ్లల్లో ఓట్లు అడుగుతా. ఇలా చేస్తే కేసీఆర్ కు డిపాజిట్లు కూడా రావు". "పాలమూరు ప్రాజెక్టులపై పాదయాత్ర చేస్తామని బీఆర్ఎస్ నాయకులు బయలుదేరారు. పాలమూరు నుంచి కాశీ వరకు పొర్లుదండాలు పెట్టినా వాళ్ల పాపాలు తీరవు. ప్రజలు క్షమించరు" "ప్రజలు ఇచ్చిన ధైర్యంతో గల్లీలో ఉండే కేడీతోనైనా.. ఢిల్లీలో ఉండే మోదీతో అయినా కొట్లాడుతా. కేసీఆర్ మేకవన్నె పులి అని గుర్తించక రెండుసార్లు ముఖ్యమంత్రి చేశారు. దొంగలకు సద్దులు మోసే వారితో జాగ్రత్తగా ఉండాలి. మన వారైనా అప్రమత్తత అవసరం. వనపర్తిలో ఒకరు.. పాలమూరులో ఒకరు మోపు అయ్యారు.తాజాగా మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో ప్రజాపాలన - ప్రగతి ఉత్సవాల సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో కీలకమైనవి. ఎప్పటిలానే ఆయన తరహా తాను చెప్పే కొన్ని మాటల్ని ఈ సభలోనూ రిపీట్ చేశారు. ఎప్పటిలానే మరోసారి కేసీఆర్ కు సవాలు విసిరారు. గతంలో అసెంబ్లీకి రావాలని తరచూ కోరే ఆయన..ఇటీవల కాలంలో అసెంబ్లీలో చర్చకు రావాలన్న ఛాలెంజ్ విసురుతున్నారు. గతానికి ఈసారి తేడా ఒకటుంది. అసెంబ్లీలో నిర్వహించే చర్చలో తాను కానీ ఓడితే అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ కు క్షమాపణలు చెబుతానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.తెలంగాణలో రాజకీయాన్ని ఏకపక్షం చేసుకోవాలని కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తున్నట్లుగా కనిపిస్తోంది. రాజకీయాల్లో అదను చూసి దెబ్బ తీయాలని సామెత ఉంది. విపక్షం వీక్ గా ఉన్నప్పుడే జోరు చేయాలని ముందుకు సాగుతారు. రేవంత్ రెడ్డి ఇపుడు అదే పంథాను అనుసరిస్తున్నారు. బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ అయితే గత రెండున్నరేళ్ళుగా ఫాం హౌజ్ లోనే ఉంటున్నారు. ఓటమి తరువాత ఎందుకో ఆయన మునుపటి మాదిరిగా దూకుడు చేయడం లేదు. దీంతో ఈ అవకాశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అతి పెద్ద అడ్వాంటేజ్ గా తీసుకుని స్పీడ్ పెంచేశారు అని అంటున్నారు. రేవంత్ రెడ్డి సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఎన్నికలు నేడో రేపో అన్నట్లుగా ఆయన హడావుడి చేస్తున్నారు. తాజాగా చూస్తే ఆయన బీఆర్ఎస్ కి బలం ఉండే ఉమ్మడి పాలమూరు లో పర్యటించారు. అక్కడ భారీ బహిరంగ సభను నిర్వహించడమే కాదు ఏకంగా కేసీఆర్ కే సవాల్ చేశారు. తన రెండున్నరేళ్ళ పాలన కేసీఆర్ పదేళ్ల పాలనకు తేడా ఏంటో చర్చిద్దాం సిద్ధమేనా అని సవాల్ చేశారు. కేసీఆర్ చర్చకు రెడీ అంటే తాను కూడా రెడీ అన్నారు. అభివృద్ధి సంక్షేమం విషయంలో తాను బీఆర్ఎస్ కంటే మెరుగైన పాలన అందిస్తున్నానని రేవంత్ రెడ్డి చెప్పుకున్నారు. ఇక ఈ మధ్య కాలంలో అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని తమ ప్రభుత్వం ఏమి చేసిందో తాను చెబుతాను అని కూడా రేవంత్ రెడ్డి చెప్పారు.కేసీఆర్ అయితే జనం లోకి రావడం లేదు. ఆయన గత డిసెంబర్ లో ప్రెస్ మీట్ పెట్టారు. ఒక రోజు శీతాకాల సమావేశాలకు అటెండ్ అయ్యారు. 2026 లో కొత్త ఏడాదిలో మూడు ప్రాంతాలలో మూడు భారీ బహిరంగ సభలు పెడతామని కూడా ప్రకటించారు. కానీ అవేమీ జరగలేదు. యధా ప్రకారం కేసీఆర్ ఫాం హౌజ్ కే పరిమితం అయిపోయారు. మరో వైపు బీఆర్ఎస్ నుంచి కవిత బయటకు వెళ్లి కొత్త పార్టీని పెట్టుకుంది ఆమె బాణాలు బీఆర్ఎస్ మీదనే ఎక్కుపెడుతోంది. అటు చికాకు అనుకుంటే హరీష్ రావు బీజేపీలో చేరిపోతున్నారని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రకటనలు మరో చికాకుగా మారాయి. వాటికి హరీష్ రావు ధీటుగా బదులిస్తూ ఖండిస్తున్నప్పటికీ జనంలో గులాబీ పార్టీ రేకులు విడిపోతున్నాయని చెప్పడానికి ఈ వ్యూహాత్మకమైన విమర్శలు అన్నది కూడా ఉంది. ఇక కేటీఆర్ విమర్శలు కానీ ఆయన స్టేట్మెంట్స్ కానీ కాంగ్రెస్ పట్టించుకోవడం లేదు. తన మీదకు ఇద్దరు నాయకులను వదిలేశారని కానీ వారి వల్ల ఏమీ కాదని రేవంత్ రెడ్డి హరీష్ కేటీఆర్ లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు గమనార్హం. తనకు సమ ఉజ్జీ కేసీఆర్ తప్ప బీఆర్ఎస్ లో ఎవరూ కారని రేవంత్ రెడ్డి చెప్పకనే చెబుతున్నారని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే కేసీఆర్ ఇప్పటప్పట్లో వచ్చే అవకాశం అయితే కనిపించడం లేదని అంటున్నారు. దాంతో రేవంత్ రెడ్డి దూకుడు రాజకీయం తెలంగాణాలో కొనసాగుతోంది. పైగా 2034 వరకూ మాదే అధికారం అని బల్ల గుద్ది మరీ రేవంత్ రెడ్డి చెబుతున్నారు.

# రేవంత్ వర్సెస్ పవన్

**హైదరాబాద్** సాధారణంగా రాజకీయాలలో కొందరి మధ్య వైరం అనేది అంత ఈజీగా సాధ్యం కాదు. ఎందుకంటే వారి మధ్య అటువంటి వ్యవహారాలు ఎప్పుడూ చోటు చేసుకోవు కాబట్టి.. ప్రజలు ఆ విధంగా ఆలోచించరు. కానీ తెలంగాణలో అందుకు విరుద్ధమైన పరిస్థితులు చోటుచేసుకున్నాయి.. ఎవరు ఊహించని విధంగా.. కలలో కూడా అనుకోని విధంగా రాజకీయ వైరం ఏర్పడింది. అది కాస్త ఒక రకమైన సంచలనానికి దారితీసింది. ఇది ఎటువైపు వెళుతుంది.. దేని వైపు దారితీస్తుందో చూడాలి.ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడిన మాటల తర్వాత.. అది రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ సంచలనం సృష్టించిన తర్వాత.. ఈ ఎపిసోడ్లోకి కాంగ్రెస్ నాయకులు వచ్చేసారు. ఆ విశ్లేషకుడిని బాధిత పక్షం లాగా చూపించేందుకు ప్రయత్నాలు చేశారు. ముందుగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ ఈ వ్యవహారంలోకి ప్రవేశించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను హైదరాబాద్ ఖాళీ చేసి వెళ్లిపోవాలని.. డిమాండ్ చేశారు. ఆ తర్వాత జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ప్యాకేజి స్టార్ అంటూ మండిపడ్డారు. ఇక టీఆర్ఎస్ అధినేత్రి పళ్లు రాలుతాయి అంటూ పవన్ కళ్యాణ్ మీద మండిపడ్డారు. కాంగ్రెస్ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కళ్యాణ్ బిజెపి, బీఆర్ఎస్ కు అమ్ముడుపోయిన వ్యక్తి అని.. ఆయన ఒక ప్యాకెజిస్టార్ అంటూ ఆరోపించారు..ఈ పరిణామాల తర్వాత పవన్ కళ్యాణ్ స్పందించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలను పెద్దగా లెక్కలోకి తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఎప్పుడైతే హస్తం పార్టీ నాయకులు తనమీద విమర్శలు చేయడం మొదలుపెట్టారో ఆయన నేరుగా రంగంలోకి దిగారు. అంతేకాదు.. తెలంగాణలోని గచ్చిబౌలి ప్రాంతంలో సంధ్య కన్వెన్షన్ హాల్ లో అంతర్గత సమావేశం నిర్వహించుకుంటామని తెలంగాణ పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం చివరి నిమిషంలో పవన్ కళ్యాణ్ కు హ్యాండ్ ఇచ్చింది. దీనికి తెలంగాణ పోలీసులు చెప్పిన కారణమేంటంటే.. ప్రొఫెసర్ నాగేశ్వర్ మీద జనసేన నాయకులు విమర్శలు చేయడం ద్వారా.. తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతిన్నది.. తెలంగాణ ప్రజలు పవన్ కళ్యాణ్ మీద ఆగ్రహంగా ఉన్నారు.. అందువల్ల ఈ సమావేశానికి అనుమతి ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. జన సేన అధినేత తన గృహం నుంచి విలేకరుల సమావేశం నిర్వహించారు. చాలా ఆవేశంగా మాట్లాడారు. తాను ఇక్కడ పోటీ చేసే విషయం మీద స్పష్టత ఇచ్చారు. పోరాటల పురిటిగడ్డలో ఎందుకు సమావేశంనిర్వహిస్తున్న విషయం మీద కూడా క్లారిటీ ఇచ్చారు. జనసేన అధినేత మీద కవిత ఆరోపణలు చేస్తే ఒక రకంగా తీసుకోవచ్చు. ఎందుకంటే ఆమెకు ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకమైన గుర్తింపు కావాలి. అందువల్లే ఆమె అలా చేస్తుందనుకోవచ్చు. భారత రాష్ట్ర సమితి పవన్ కళ్యాణ్ మీద విమర్శలు చేస్తే.. దాన్ని కూడా ఒక రకంగా తీసుకోవచ్చు. ఎందుకంటే భారత రాష్ట్ర సమితికి ఆంధ్రా ప్రాంతం మీద.. అక్కడి రాజకీయ నాయకుల మీద విమర్శలు చేస్తేనే ఆ పార్టీకి మనుగడ. అదే గనుక లేకపోతే ఆ పార్టీకి తెలంగాణలో కొనసాగింపు ఉండదుభారత రాష్ట్ర సమితి నుంచి కవిత వరకు ఏపీ డిప్యూటీ సీఎం మీద విమర్శలు చేశారంటే దాని వెనక ఒక అర్థం ఉంది. కానీ కాంగ్రెస్ నాయకులు ఈ స్థాయిలో జనసేన అధినేత మీద విమర్శలు చేయడం నిజంగా ఆశ్చర్యం. రేవంత్ రెడ్డి ఆదేశాల లేకుండా వారు ఇలా చేశారనుకోవడానికి లేదు. కానీ ఈ ఉద్దేశ్యాలు ఆశించి కాంగ్రెస్ పార్టీ ఇలాంటి విమర్శలు చేస్తుందో అర్థం కావడం లేదు..త్వరలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికలు అన్ని పార్టీలకు అత్యంత ప్రతిష్టాత్మకం. అలాంటప్పుడు తెలంగాణ సెంటిమెంట్ రగిలితేనే ఓట్లు పడతాయని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందువల్లే జనసేన అధినేత మీద ఈ స్థాయిలో విమర్శలు చేసినట్టు కనిపిస్తోంది. కానీ హైదరాబాదులో సెటిలర్ ఓటర్లు చాలా ఎక్కువగా ఉన్నారు. పవన్ కళ్యాణ్ మీద విమర్శలు చేస్తే..ఆంధ్రా వాదం మీద ఆరోపణలు చేస్తే అప్పుడు ఆ ఓట్లు వేరే పార్టీ వైపు వెళ్లే అవకాశం ఉంది.మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తానని జనసేనాని స్పష్టం చేశారు. అలాంటప్పుడు కాంగ్రెస్ ఎందుకు అతడిని టార్గెట్ చేసినట్టు.. కాంగ్రెస్ జాతీయ పార్టీ.. మన పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్లో కూడా రాజకీయాలు చేస్తోంది. అలాంటప్పుడు పవన్ కళ్యాణ్ విషయంలో రేవంత్ ఇలాంటి వైఖరి ఎందుకు తీసుకున్నారు.. భారత రాష్ట్ర సమితికి అవకాశం ఇవ్వకూడదనా.. పవన్ కళ్యాణ్ వస్తే భారత రాష్ట్ర సమితికి ప్రయోజనం దక్కుతుందనా.. ఈ ప్రశ్నలు రాజకీయ విశ్లేషకులు వేస్తున్నారు.. ఒకవేళ ఇదే విధానం కనుక రేవంత్ రెడ్డిది అయితే.. ఆయన ముందుగానే మేల్కొన్నట్టు..కానీ, గత ఎన్నికల్లో సెటిలర్ ఓటర్లు భారత రాష్ట్ర సమితి వైపు మొగ్గు చూపించారు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ విషయంలో రేవంత్ రెడ్డి కొనసాగించిన వైఖరి వల్ల వారి ఓట్లు ఎటువైపు వెళ్తాయో చూడాల్సి ఉంది. కాకపోతే ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్న వ్యాఖ్యల ద్వారా గోటితో పోయే వ్యవహారాన్ని ఇక్కడ దాకా తీసుకొచ్చారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదంగా మార్చారు. అయితే ఇది ఎక్కడదాకా దారి తీస్తుందో చూడాల్సి ఉంది.

# రాంగ్ రూట్‌లో వస్తే అడ్డంగా బుక్కైనట్టే...

## - 100 ప్రధాన మార్గాల్లో సీసీ కెమెరాలు..

**హైదరాబాద్,** ట్రాఫిక్ పోలీసులు లేరు కదా అని కాస్త దూరం తగ్గించుకోవడానికి అడ్డదారిలో బండి నడిపితే ఇకపై నేరుగా కెమెరా కంటికి చిక్కాల్సిందే. నగరంలో రాంగ్ సైడ్ డ్రైవింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ట్రాఫిక్ విభాగం పూర్తిగా సిద్ధమైంది. అడ్డదారిలో వెళ్తూ నిబంధనలు ఉల్లంఘిస్తే క్షణాల వ్యవధిలోనే మొబైల్‌కు ఈ-చలానా సందేశం వచ్చేలా ఏర్పాట్లు చేశారు. పదేపదే ఇలాంటి తప్పులకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి కూడా పోలీసులు వెనుకాడటం లేదు.నగరవ్యాప్తంగా వాహనదారులు అడ్డదారిలో ప్రయాణిస్తున్నట్లు సుమారు 200కు పైగా ప్రాంతాలను ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. వీటిలో అత్యంత ప్రధానమైన 100 మార్గాల్లో అత్యాధునిక సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే వారిని ఈ కెమెరాల ద్వారా గుర్తించి, కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి నేరుగా జరిమానాలు విధిస్తున్నారు.ఎలాగైనా వెంటనే గమ్యస్థానానికి చేరాలనే తొందరతో వాహనదారులు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఈ సంవత్సరం కేవలం 5 నెలల వ్యవధిలోనే రాంగ్‌రూట్ ప్రయాణాల వల్ల 50కి పైగా ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో కుటుంబానికి ఆధారమైన ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. ఉదయం, రాత్రి వేళల్లో రోడ్లు ఖాళీగా ఉంటాయని, పోలీసులు ఉండరనే ఉద్దేశంతో ఇష్టానుసారంగా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.ఎదురుగా వాహనాలు వేగంగా దూసుకొస్తున్నా వినకుండా అడ్డదారిలో వచ్చే వాహనదారులు, పోలీసుల తనిఖీల్లో పట్టుబడినప్పుడు రకరకాల సాకులు చెబుతున్నారు. చుట్టూ తిరిగి రావడం ఇబ్బందని, కొద్ది దూరమే కదా వచ్చామంటూ మాయమాటలతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరికొందరైతే అడ్డదారిలో రావడమే కాకుండా పోలీసులతో గొడవకు దిగుతూ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తున్న వారిపై ప్రతి నెల నమోదవుతున్న కేసుల్లో సగానికి పైగా (20 మందిపై కేసులు నమోదైతే అందులో 10 మంది) రాంగ్ సైడ్‌లో వచ్చే వాహనదారులే ఉంటుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.మలుపులు దూరంగా ఉన్నాయని కాలనీల్లోకి వెళ్లేందుకు రాంగ్‌సైడ్‌ను ఎంచుకునే వాహనదారులు, ట్రాఫిక్ చలానాల నుండి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లను తొలగించడం లేదా మార్చడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. నగరంలో కేవలం ఒక నెల వ్యవధిలోనే రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై 30 ప్రాంతాల్లోనే ఏకంగా 2 లక్షలకు పైగా ఈ-చలానాలు నమోదు కావడం ఈ ఉల్లంఘనల తీవ్రతను నిరూపిస్తోంది.నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఎదురవుతున్న ప్రాంతాలుగా షేక్‌పేట్, ఫిలింనగర్, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, టోలిచౌకి, మెహదీపట్నం, మాసబ్‌ట్యాంక్, అత్తాపూర్, చార్మినార్, అబిడ్స్, నారాయణగూడ, ఖైరతాబాద్, పంజాగుట్ట, బేగంపేట్, అమీర్‌పేట్, రాణిగంజ్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, అఫ్జల్‌గంజ్, కాచిగూడ, సుల్తాన్‌బజార్ వంటి నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించారు. ఈ ప్రదేశాలలో అడ్డదారి ప్రయాణాల వల్ల తరచూ తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

### విశాఖ స్టీల్ ఘటనలో

# తొమ్మిదికి చేరిన మృతుల సంఖ్య

**విశాఖపట్నం** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. మరో ఆరుగురు కార్మికులకు గాయాలు అయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. సోమవారం నాడు సాయంత్రం 1500 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉన్న 150 టన్నుల మోల్టెన్ మెటల్ లాడెల్ పేలిపోయి, దాదాపు 25 అడుగుల విస్తీర్ణంలో హాట్ మెటల్ ఎగసిపడింది. ఘటన సమీపంలో ఉన్న కార్మికుల మీద హాట్ మెటల్ పడడంతో, ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడంతో ప్రాణాలు తొమ్మిది మంది కోల్పోయారు. మృతులు: గోల్డ్ కుమార్ (మేనేజర్) జీవీ అప్పారావు (సైడ్ ఆపరేటర్) ప్రభాకరరావు (స్టాండ్ 3 ఆపరేటర్) జి.భానుకుమార్ (షిఫ్ట్ ఇన్చార్జి, స్టాండ్-ఆ) కృష్ణ నాగు (స్టాడ్ -4 ఆపరేటర్) రమణ (పౌడర్ కలాసీ-కాంట్రాక్ట్ వర్కర్) త్రినాథ్ (స్టాండ్ ఆపరేటర్-కాం ట్రాక్టు వర్కర్) ఎన్. అప్పలరాజుగా (స్టాండ్ ఆపరేటర్- కాంట్రాక్టు వర్కర్) గుర్తుతెలియని మరో వ్యక్తి క్షతగాత్రులు: పైడిరాజు రావూరి మల్లికార్జునరావు పల్లెల శ్రీనివాస్ అర్జున్ అప్పారావు సత్యానంద్ సూరిబాబు స్టీల్ మెల్టింగ్ షాప్) నిర్వహణ ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడంతోనే ఈ ప్రమాదం జరిగిందని కార్మికుల ఆరోపణలు. ఇదే నాటూ?1లో మెటల్ రన్నింగ్ ప్రక్రియ సరిగ్గా చేయక గత నాలుగు రోజుల కింద హాట్ మెటల్ ఎగసిపడిందని, కానీ ప్రమాద తీవ్రత ఎక్కువగా లేదని, ఆరోజే జాగ్రత్త పడి ఉంటే ఇంత పెద్ద ప్రమాదం జరిగేది కాదని చెప్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్ట పరిహారం ప్రకటిచారు.

# గంజాయి మత్తులో యువకుల వీరంగం

**సత్తెనపల్లి** గంజాయి మత్తులో యువకుతు వీరంగం సృష్టించారు. ఒక మహిళతో వాగ్వాదం చేసారు. వలస కూలీపై విచక్షణారహితంగా దాడి చేసారు. దాడికి పాల్పడిన యువకులు జనసేన కార్యకర్తలుగా స్థానికులు చెబుతున్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని దమ్మాలపాడులో ఘటన జరిగింది. రామాలయ నిర్మాణ పనుల కోసం వచ్చామని చెప్పినా వినిపించుకోకుండా కార్మికుడిపై దాడి జరిపారని బాధితుడు పేర్కొన్నాడు.

# అర్ అండ్ బీ ఈఎన్సీ ఇంటిపై ఏసీబీ దాడులు

**హైదరాబాద్** ఆర్.అండ్.బి. ఈ ఎన్ సి అధికారి మోహన్ నాయక్ పై ఏసీబీ దాడులు జరిపింది. మంగళవారం ఉదయం నుంచి మియాపూర్ లోని మోహన్ నాయక్ నివాసం లో సోదాలు కొనసాగుతున్నాయి. మోహన్ నాయక్ ఇంటి తో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఉదయం నుండి దాడులు జరుగుతున్నాయి. మియాపూర్ లోని వసంత సిటీ విల్లా నెంబర్ 98 లో మోహన్ నాయక్ వుంటున్నారు.

# స్టీల్ ప్లాంట్లో జరిగిన ఘటన దురదృష్టకరం

**- మంత్రి వాసంశెట్టి సుభాష్**



**విశాఖపట్నం** విశాఖ స్టీల్ ప్లాంట్లో జరిగిన ఘటన దురదృష్టకరం. ప్రమాదంలో గాయపడిన ముగ్గురు ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించానని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.మంత్రి మాట్లాడుతూ గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందుతోంది. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాం. గాయపడిన వారికి రూ.10 లక్షల ఎక్స్గ్రేషియా అందజేస్తాం. కార్మిక సంఘాల నేతలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. ప్రమాదం జరిగిన సమయంలో అవసరమైన సంఖ్యలోనే కార్మికులు విధుల్లో ఉన్నారు. ప్లాంట్లో భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాం. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు.

# మూడు మృతదేహాల గుర్తింపు

**విశాఖపట్నం** విశాఖ స్టీల్ప్లాంట్ ప్రమాద ఘటనలో ముగ్గురి మృతదేహాలు గుర్తింపు పూర్తయింది. భానుకుమార్, రమణ, అప్పలరాజు, మృతదేహాలను అధికారులు గుర్తించారు. మిగిలినవారి మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నందున.. డిఎన్ఏ పరీక్షల కోసం బాధిత కుటుంబాల నుంచి నమూనాలు సేకరించారు. సేకరించిన ఆహెం నమూనాలను విజయవాడ ల్యాబ్కు కేజీహెచ్ సిబ్బంది పంపుతున్నారు.

# ఘటన అత్యంత విషాదకరం

**- కేంద్రమంత్రి కుమారస్వామి**

**విశాఖపట్నం** విశాఖ స్టీల్ ప్లాంట్లో అగ్నిప్రమాద ఘటన అత్యంత విషాదకరం అని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, హోంమంత్రి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఎంపీ భరత్తో కలిసి ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గాయపడిన కార్మికులను పరామర్శించి, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులను, బాధి కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

# తాగు నీరు కోసం నీళ్ల ట్యాంకు పెకెక్కి నిరసన

**మీర్ పేట్** తాగడానికి చుక్క నీళ్లు ఇవలేని ఎమ్మెల్యే మాకొద్దని మిర్పేట్ డబల్ బెడ్ రూమ్ కాలనీ ప్రజలు నిరసనకు దిగారు. డౌన్ డౌన్ రేవంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలతో బిందెలతో నీళ్ల ట్యాంకు పైకి ఎక్కి నిరసన తెలిపారు.

# రొయ్యల రైతుల సంక్షేమం, ఆక్వాకల్చర్ రంగాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## - ఫీడ్ ధరల అంశంపై రైతులు, తయారీదారులు పరస్పర అంగీకారంతో ముందుకు రావాలి
## - అదనంగా 12 వేల ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ.1.50 రాయితీ
## - ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


**అమరావతి/విజయవాడ,** రాష్ట్రంలో ఆక్వాకల్చర్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో రొయ్యల రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, సముద్ర ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు తదితర రంగ ప్రతినిధులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రొయ్యల ఫీడ్ ధరల పెరుగుదలపై రైతులు, పరిశ్రమ వర్గాలు తమ అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చాయని మంత్రి తెలిపారు. ఫిష్‌మీల్, సోయాబీన్ తదితర ముడి పదార్థాల ధరలు పెరగడంతో ఉత్పత్తి వ్యయాలు అధికమయ్యాయని తయారీ సంస్థలు వివరించగా, ఇప్పటికే ఖర్చుల భారం పెరిగిన నేపథ్యంలో ధరల పెంపును నియంత్రించాలని రైతులు కోరినట్లు చెప్పారు. ఆక్వాకల్చర్ రంగ సమగ్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైతులు, తయారీదారులు చర్చల ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారానికి రావాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు.

ఇరు వర్గాలు ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాత తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఫీడ్ ధరల నిర్ణయంలో శాస్త్రీయ విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమైనట్లు మంత్రి వెల్లడించారు. ముడి పదార్థాల ధరలు, టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ)తో పాటు మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తులో పారదర్శక ధరల వ్యవస్థ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు. ఆక్వాకల్చర్ రైతులకు విద్యుత్ రాయితీపై మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి అదనంగా 12 వేల ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున రాయితీ అందించే ప్రక్రియ తుది దశలో ఉందన్నారు.

ఉత్తర్వులు జారీ అయిన తర్వాత అర్హత కలిగిన అన్ని ఆక్వాకల్చర్ కనెక్షన్లు అవి చిన్న, పెద్ద ఫారాలు అయినా, ఆక్వా జోన్ లేదా నాన్-ఆక్వా జోన్‌లో ఉన్నా ఈ పథకం పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో ఉత్పత్తి వ్యయం తగ్గడంతో పాటు రైతులకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని తెలిపారు. మత్స్య, ఆక్వాకల్చర్ రంగాల్లో స్థిరమైన అభివృద్ధి, పోటీతత్వ సామర్థ్యాల పెంపు, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.

# కారును ఢీకొన్ డీసీఎం: ప్రయాణికులు క్షేమం

**రంగారెడ్డి** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. మహాలక్ష్మి టిఫిన్ సెంటర్ ఎదురుగా డీసీఎం-కార్ ఢీ కొన్నాయి. ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి డీజీఎం ఢీకొట్టింది. ప్రమాదంతో కారు డివైడర్ పైకెక్కింది. ఘటనతో రోడ్డుపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్ను క్లియర్ చేసి వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసుల ప్రాథమిక అంచనా. ప్రమాదంలో ప్రాణనష్టం లేదని సమాచారం.



# సంపాదకీయం

## ఎలాంటి లోపం లేనిది, కల్తీ లేనిది అమ్మ ప్రేమ




ప్రపంచవ్యాప్తంగా ప్రతి వ్యవస్థలోనూ ఎంతో కొంత లోపం కల్తీ అవినీతి ఉంటాయి. కానీ ఎలాంటి లోపం లేనిది కల్తీ లేనిది అమ్మ ప్రేమ అంటే ఆలోచించాలి అనే రోజులు వచ్చాయి. మన చుట్టూ ఎన్ని బంధాలు ఉన్నా అమ్మ అనే బంధం లేకుంటే మాత్రం మనం అందరూ ఉన్న అనాధలమే. ఇది నా స్వఅనుభవం దేవుడు ప్రతి చోట ఉంటాడు కానీ ప్రత్యక్షంగా మనకి కనపడకపోయినా అమ్మ రూపంలో తన ప్రేమను పంచుతాడు ఇది ముమ్మాటికి నిజం. కానీ ఈరోజుల్లో పరిమితులు లేని క్షణికావేశ కామ కోరికలతో వావి వరసలు నైతికత మర్చిపోయి ప్రవర్తిస్తున్నారు ఈ విచ్చలి విడితనం వల్ల దుర్మార్గమైన నియంత్రణ లేని ఆలోచనలకు దారితీసి విచక్షణ కోల్పోయి కేవలం శారీరక సుఖానికి విలువ ఇస్తున్నారు సామాజిక స్పృహతో కూడిన జీవనం సాగిస్తే మానవ జీవితానికి ఒక విలువ ఉంటుంది భూమిపై ఉన్న అన్ని రకాల సాటి జీవులపై అధికారం పెత్తనం మనిషికి మాత్రమే ఉంది కానీ ఈ రోజుల్లో బుద్ధిలో మనకంటే అవేనయం కన్నబిడ్డలను చంపుకోవు మనిషి విలువ అంతకంతకు దిగజారి మనిషివా పశువువా అనే మాట కూడా పోల్చుకోవటానికి మనం సరిపోమేమో కదా అనిపిస్తుంది తాచుపాము కూడా అకస్మాత్తుగా వాతావరణ మార్పులలో విపరీతమైన ఎండలు వల్ల గుడ్డు పొదిగే పరిస్థితులు లేనప్పుడు మాత్రమే తన గుడ్లు తింటుంది ఆఖరికి తాచుపాముతో పోల్చుకోవటానికి కూడా సరిపోము అనిపిస్తుంది. కేరళలో ఏడాదిన్నర బాబుని ఓ తల్లి ప్రియుడుతో కలిసి చంపేసిందనే వార్త ఇలా నాతో ఈ మాటలు పలికించింది నిజంగా హృదయం కలచివేసింది

ఆ బుడ్డోడి వయసుకి 50 పైగా గాయాలు ఆ నొప్పిని ఎలా భరించాడో పురిటి నొప్పుల బాధ మాటలకు అందనిది కదా అంతటి బాధను మోసి ప్రాణాలు పణంగా పెట్టి ప్రాణాలు పోసిన ఆమె ఆ కన్న కొడుకును అలా ఎలా ప్రాణాలు తీయగలిగింది? తాత్కాలికమైన బంధం కోసం ఆ బుడ్డోడిని ఎలా హింసించి మరి అంత కర్కసంగా అంతం చేసింది?

**కర్ణాటకలో ఆరు సంవత్సరాల పాపని కూడా ఓ మహిళ ఇలానే చంపేసింది**

ఇవన్నీ చదువుతుంటే అసహ్యం వేస్తుంది పెళ్లి చేసుకున్నాక కట్టుకున్నవాడు నచ్చనప్పుడు బిడ్డల్ని కనకండి పోనీ బిడ్డల్ని కన్నాక నచ్చకపోతే బిడ్డల్ని పిల్లలు లేని వారికి అయినా ఇవ్వండి లేదా దూరంగా వెళ్లిపోండి అంతేగాని మీ పైశాచిక శారీరక సుఖం కోసం బతికుండగానే వాళ్లకు నరకాన్ని చూపించి మరీ చంపేసి అమ్మ అంటేనే ఏమీ ఆశించని తరగని ప్రేమ అనే పదానికి ఉన్న అర్థాన్ని ఆలోచించేలా చేసే క్షణాలను దయచేసి తీసుకురాకండి మీ దిగజారుడుతనం వల్ల అమ్మ పదానికి అర్థాన్ని మార్చకండి

సుధ కొనకళ్ళ
అనువంశిక ఆయుర్వేద వైద్యురాలు హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్
ఫౌండర్ సత్తుపల్లి 9704242156

## ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారిన
# నిజామాబాద్ డీపీఆర్ ఓ కార్యాలయం

- అక్రిడేషన్ కార్డుల వెనుక రూ. లక్షల దందా.?
- ప్రశ్నించే జర్నలిస్టులపై హేళన, కక్ష సాధింపులు
- కలెక్టర్లకు ఐ అండ్ పి ఆర్ కమిషనర్ కు ఉన్నత అధికారులకే తప్పుడు సమాచారం
- అర్హులైన ఫ్రీలాన్స్, ఫీల్డ్ జర్నలిస్టులకు మొండిచేయి
- డబ్బులు ఇస్తే అనర్హులకు రెడ్ కార్పెట్
- జోయాలుకాస్ ఉద్యోగి, ఇటుకబట్టీ కూలీ, మెస్ సూపర్వైజర్లకు జర్నలిస్ట్ కార్డులా.?
- ఒక్కో కార్డుకు రూ. 30,000 నుండి రూ. 50,000 వసూలు.?
- 2016 నుండి ఒకే జిల్లాలో పాతుకుపోయిన అధికారి పద్మశ్రీ
- నిజాంబాద్ డిపిఆర్ఓ కు బదిలీల ఉత్తర్వులు వర్తించవా.?
- నూతన కలెక్టర్ చొరవ తీసుకుని నిష్పక్షపాత విచారణ జరిపించాలి
- సామాజిక కార్యకర్తల డిమాండ్.



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికారంగాన్ని నిజామాబాద్ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డీపీఆర్ ఓ ) కార్యాలయం అబాసుపాలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు శ్రమిస్తూ, వార్తల కోసం ప్రాణాలు పణంగా పెట్టే నిజమైన జర్నలిస్టులను హేళన చేస్తూ, కలెక్టర్, ఐ అండ్ పి ఆర్ కమిషనర్, ఉన్నత అధికారులను సైతం తప్పుదోవ పట్టిస్తున్న ఘనత ఇక్కడి డీపీఆర్ ఓ పద్మశ్రీ కే దక్కుతుంది. నిబంధనలను తుంగలో తొక్కి, అక్రిడేషన్ కార్డుల జారీలో భారీ అవకతవకలకు పాల్పడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను అవినీతిమయం చేస్తున్న తీరుపై జిల్లావ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

### పబ్లిక్ డొమైన్‌లో లిస్టులు పెట్టకపోవడం వెనుక మతలబు ఏంటి.?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం జర్నలిస్టుల అక్రిడేషన్ జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి. కానీ నిజామాబాద్ డీపీఆర్ ఓ పద్మశ్రీ మాత్రం ఈ లిస్టులను బయటపెట్టడానికి నిరాకరిస్తున్నారు. పబ్లిక్ డొమైన్‌లో పెడితే ఎవరెవరు అర్హులో, ఎవరెవరు అనర్హులో సమాజానికి తెలిసిపోతుందనే భయంతోనే తన అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. 2022-2024, ప్రస్తుత 2026-2028 కాలానికి సంబంధించిన అక్రిడేషన్ల జారీలో జరిగిన దారుణాలు వింటే ముక్కున వేలేసుకోవాల్సిందే.

### జర్నలిజంతో సంబంధం లేని వారికి 'అక్రిడేషన్' బహుమతి..

24 గంటలు ఫీల్డ్‌లో పనిచేసే సీనియర్ జర్నలిస్టులను, దశాబ్దాలుగా నమ్ముకున్న ఫ్రీలాన్స్ జర్నలిస్టులను పక్కనపెట్టి, కనీస అర్హత లేని సుమారుగా 70 మందికి పైననే అనర్హులకు అక్రిడేషన్ కార్డులు కట్టబెట్టారు. ఒక ప్రముఖ జ్యువెలరీ సంస్థ (జోయాలుకాస్) లో పనిచేసే వ్యక్తికి జర్నలిస్ట్ కార్డు జారీ చేశారు. నవీపేటలోని ఒక ఇటుకబట్టీలో పనిచేసే వ్యక్తికి అక్రిడేషన్ ఇచ్చారు. నిజామాబాద్ జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లోని ఒక మెస్‌లో సూపర్వైజర్‌గా పనిచేసే వ్యక్తికి, మోర్తాడ్‌లో మొరం దందా (మట్టి వ్యాపారం) చేసే వ్యక్తికి సైతం జర్నలిస్టు కార్డులు జారీ కావడం డీపీఆర్ ఓ పద్మశ్రీ 'అవినీతి ప్రతిభ'కు నిదర్శనం. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉచితంగా ఇస్తున్న ఈ కార్డులను అమ్ముకుంటూ, ఒక్కో కార్డుకు రూ. 30,000 నుండి రూ. 50,000 వరకు లంచాలు వసూలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### పదేళ్లుగా ఒకే జిల్లాలో మకాం.. బదిలీల నిబంధనలు వర్తించవా.?

సాధారణంగా ప్రభుత్వ అధికారులకు మూడు లేదా నాలుగేళ్లకు బదిలీలు జరుగుతాయి. కానీ 2016 ఉమ్మడి జిల్లా కాలం నుండి నేటి 2026 వరకు సదరు డీపీఆర్ ఓ పద్మశ్రీ నిజామాబాద్ జిల్లాలోనే తిష్ట వేసుకొని కూర్చున్నారు. ఉన్నత అధికారులకు తాయిలాలు ఇస్తూ రాజకీయ నాయకులను మేనేజ్ చేస్తూ బదిలీ ఉత్తర్వులు తనకు వర్తించకుండా చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. కాంట్రాక్టర్ల నుండి డిమాండ్లు.. అవుట్‌సోర్సింగ్ నియామకాల్లో గోల్‌మాల్ గతంలో మాజీ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి హయాంలో ఒక కాంట్రాక్టర్ నుండి ఈ డీపీఆర్ ఓ ఏకంగా రెండు లక్షల రూపాయలు ఫోన్ లోనే డిమాండ్ చేసినట్లు సమాచారం. దీనిపై ఇప్పటివరకు ఎలాంటి విచారణ జరగకుండా అధికారులను మేనేజ్ చేసినట్లు గుసగుసలు వినిపించాయి. ఇప్పటివరకు చర్యలూ లేవు. అంతేకాకుండా, డీపీఆర్ ఓ కార్యాలయంలో జరిగిన అవుట్‌సోర్సింగ్ నియామకాల్లో కూడా భారీగా అవకతవకలు జరిగాయని పత్రికల్లో కథనాలు వచ్చినా కలెక్టర్, జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది.

### నూతన కలెక్టర్ న్యాయం చేసేనా.?

ప్రజాధనంతో నడిచే ఒక బాధ్యతాయుతమైన ప్రభుత్వ కార్యాలయం ఇలా ప్రజల విశ్వాసాన్ని కోల్పోతే, ఆ ప్రభావం మొత్తం జిల్లా పరిపాలనపై పడుతుందని సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు నూతనంగా విచ్చేసిన, ప్రజా సమస్యలపై తల్లిలా స్పందించే కలెక్టర్ ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించాలి. తక్షణమే నిష్పక్షపాత విచారణ జరిపి, అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని, అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన సదరు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా సమాజ పరిరక్షణ కమిటీ మరియు సామాజిక కార్యకర్తలు బలంగా డిమాండ్ చేస్తున్నారు.జర్నలిస్ట్ ల పై కక్ష సాధింపు లు చేస్తూ పై అధికారులకు తప్పుడు రిపోర్ట్ ను పంపినందుకు డి పి ఆర్ ఓ పద్మశ్రీని వెంటనే సస్పెండ్ చేయాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి.

# పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ.. డ్రైనేజీలపై లేదా.?

## ఠాకూర్ కాలనీలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ: నరకప్రాయంగా మారిన స్థానికుల జీవితాలు

కీసర (ప్రశ్న న్యూస్) కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని బండ్లగూడ ఠాకూర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. కాలనీలోని మ్యాన్‌హోల్స్ నుండి డ్రైనేజీ నీరు నిరంతరం రోడ్లపైకి పొంగిపొర్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడం వలన కాలనీ అంతటా విపరీతమైన దుర్వాసన వ్యాపిస్తోంది. మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తుండటంతో దోమలు, ఈగలు చేరి రోగాలు వ్యాపించే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు అదే మురుగునీటి పక్కనే ఆడుకోవాల్సి వస్తోందని, దీనివల్ల వారు త్వరగా అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. కాలనీలో అడుగు పెట్టాలన్నా, ఇంట్లో ప్రశాంతంగా ఉండాలన్నా ఈ వాసన భరించలేకపోతున్నామని వారు వాపోతున్నారు.

### అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

"గత రెండేళ్లుగా ఈ సమస్యపై మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి విన్నవిస్తూనే ఉన్నాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇంటి పన్నులు మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తున్న అధికారులు, డ్రైనేజీ క్లీన్ చేయించడానికి మాత్రం ముందుకు రావడం లేదు. చెప్పి చెప్పి మాకు విసుగొచ్చింది." అని ఒక స్థానికుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం



చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఠాకూర్ కాలనీని సందర్శించి ఈ డ్రైనేజీ సమస్యకు




శాశ్వత పరిష్కారం చూపాలని, తమను ఈ నరకప్రాయమైన దుర్వాసన నుండి కాపాడాలని కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# భూ వివాదంలో అక్రమదారులకు అండగా నిలుస్తున్న జగిత్యాల రూరల్ ఎస్ఐ

- అధికారుల ముందే రమేష్ దాడి చేసిన పట్టించుకోని వైనం
- బాధితులు ఫిర్యాదు చేసిన పట్టించుకోని ఎస్సై ఉమా సాగర్
- మానసిక వేధింపులు, బైండోవర్ చేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్న ఎస్ఐ





జగిత్యాల రూరల్ (ప్రశ్న న్యూస్) మండల పరిధిలోని గుట్రాజ్‌పల్లి గ్రామంలో భూమి వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. గుట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు పురుమల్ల ఆంజనేయులు (35)కు అనంతారం గ్రామ శివారులోని 109/ఉ/2/2 సర్వే నెంబరుకు సంబంధించిన భూమి వివాదంలో రూరల్ ఎస్సై ఉమా సాగర్ ఏక పక్షాన వ్యవహరించడం విమర్శలకు దారితీస్తుంది. రైతు పట్టా భూమి నుంచి దారికోసం గత నెల రోజులుగా న్యాయవాది పయ్యావుల రమేష్ వాగ్వాదానికి దిగడం, అధికారుల ముందే ఆంజనేయులుపై దాడి చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయంపై ఆంజనేయులు ఫిర్యాదు చేయగా జగిత్యాల రూరల్ ఎస్సై ఉమా సాగర్ పట్టించుకోకపోగా సంఘటన జరిగిన 15 రోజులకు లాయర్ ఇచ్చిన ఫిర్యాదు స్వీకరించి బాధితుడిపైనే తప్పుడు కేసు నమోదు చేశారని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రైతును పలుమార్లు పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకుని మానసికంగా వేధింపులు, భయభ్రాంతులకు ఎస్సై గురి చేస్తున్నారని తెలిపారు. ఇటీవల కూడా రైతుపై అక్రమ కేసులు పెడతానని, బైండోవర్ చేయిస్తానని ఎస్ఐ బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో తన భూమిని కబ్జా చేయాలని చూస్తున్న న్యాయవాది పయ్యావుల రమేష్‌కు ఎస్ఐ ఉమా సాగర్ పూర్తి అండగా నిలవడం, సివిల్ కేసు అయిన భూ వివాదంలో పోలీసులు జోక్యం చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంలో పయ్యావుల రమేష్‌పై, ఆయనకు అండగా నిలుస్తున్న ఎస్ఐ ఉమా సాగర్‌పై పోలీసు ఉన్నతాధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుడు ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని బాధితులకు న్యాయం చేయాలని రక్షకభటులు అంటే న్యాయానికి రక్షణ కల్పించాల్సింది పోయి అన్యాయానికి ఎస్సై అండగా ఉండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణయే లక్ష్యంగా వాహనాల తనిఖీలు

**సిరిసిల్ల ఎల్లమ్మ సర్కిల్ వద్ద తనిఖీల్లో పాల్గొన్న ఎస్పీ మహేష్ బి. గితే**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా మంగళవారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలోని ఎల్లమ్మ సర్కిల్ వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొని క్షేత్రస్థాయిలో తనిఖీలను పర్యవేక్షించారు. ఈసందర్భంగా విధుల్లో ఉన్న అధికారులకు, సిబ్బందికి అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, వాహనాల డాక్యుమెంట్లు పరిశీలించాలని తెలియజేశారు. సరైన పత్రాలు లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నెంబర్ ప్లేట్లు కలిగిన వాహనాలను సీజ్ చేయాలని, మైనర్లు వాహనాలు నడుపుతున్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ వినియోగించాలని,మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక శక్తులు, అనుమానిత వ్యక్తుల కట్టడి మరియు నేరాల నివారణ కోసమే జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీలకు ప్రజలందరూ సహకరించాలని ఎస్పీ కోరారు. ఎస్పీ వెంట ట్రాఫిక్ ఆర్.ఎస్.ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్ అండ్ బి అధికారుల తో సమీక్ష నిర్వహించిన :మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

- వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- వాగులు వంకలు పార్లి ప్రమాదాలకు ఆస్కారం ఉన్న రోడ్లను ,బ్రిడ్జిలను గుర్తించి ప్రమాద హెచ్చరికలు పెట్టాలి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ ) వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారులు క్షేత్ర స్థాయిలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.వాగులు వంకలు పార్లి ప్రమాదాలకు ఆస్కారం ఉన్న రోడ్లను,బ్రిడ్జిలను గుర్తించి ప్రమాద హెచ్చరికలు పెట్టాలనీ,అందుకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు,లో కాజ్ వేలు వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది వానకాలం సీజన్ లో క్షేత్ర స్థాయిలో మానిటరింగ్ చేస్తూ అప్రమత్తంగా ఉన్నట్లే..ఎర్రమంజిల్ ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ సెంటర్ ఏర్పాటు చేసుకుని,జిల్లాల వారీగా రోజు వారి పరిస్థితులు పర్యవేక్షించాలని చెప్పారు. ఆర్ అండ్ బి డివిజన్ ల వారిగా క్షేత్ర స్థాయి రిపోర్ట్ రోజు తనకు తెలపాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు.రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు సి.ఈ,ఎస్.ఈ,ఈ.ఈ, డి.ఈ,ఏ.ఈ లు ఖచ్చితంగా ప్రతి రోజు ఫీల్డ్ విజిట్ చేయాల్సిందేనని తేల్చి చెప్పారు.పురోగతిలో ఉన్న పలు రోడ్లు, ఆర్వోబి,ఆర్యుబి లపై ఆరా తీసిన మంత్రి,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఫినిషింగ్ స్టేజ్ లో ఉన్నవాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, సెక్రెటరీ ప్రావిణ్య,సి.ఈ లు బి.వి రావు,ధర్మారెడ్డి, వనజ పలువురు ఆర్ అండ్ బి ఇంజనీర్లు ఉన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు శక్తివంచనలేకుండా కృషి చేయాలి

**సిరిసిల్ల నియోజక వర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ తుల ఉమ**



ఎల్లారెడ్డి పేట( ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త శక్తివంచనలేకుండా కృషి చేయాలని సిరిసిల్ల నియోజక వర్గ సభ్యత్వ నమోదు మెంబర్షిప్ ఇంచార్జ తుల ఉమ తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్ లో ఎల్లారెడ్డి పేట, వీర్నపల్లి మండలాల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ సభ్యత్వ నమోదు మెంబర్షిప్ ఇంచార్జ తుల ఉమ హాజరయ్యారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మాజీ జడ్పిటిసి సభ్యులు చీటి లక్ష్మన్ రావు కార్యాలయంలో తులఉమ తో పాటు బీఆర్ఎస్ శ్రేణులకు తేనేటి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా తుల ఉమను మాజీ జెడ్పిటిసి చీటి లక్ష్మణ్ రావు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు గుండారపు కిష్టారెడ్డి, కుంబాల మల్లారెడ్డి, పిల్లి రేణుక కిషన్, గుల్లపెల్లి నర్సింహా రెడ్డి, ఎల్లారెడ్డి పేట్ సర్పంచ్ ఎలాగందుల నర్సిహింలు, మీసం రాజం మండల ఉప సర్పంచ్ పోరం అధ్యక్షులు మందాటి రాముయాదవ్, ఉప సర్పంచ్ బంధారపు బాల్రెడ్డి, కొర్రి అనిల్ కుమార్, గన్నమనేని సుధాకర్ రావు,రాజు నాయక్ , కనకట్ల తిరుపతి, జుబేర్ తో పాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు మరింత నాణ్యమైన అన్నప్రసాదం అందించడమే టీటీడీ లక్ష్యం

- అదనపు ఈవో సి హెచ్ వెంకన్న చౌదరి
- రైస్ మిల్లర్లతో సమావేశంలో టీటీడీ అదనపు ఈవో
- అన్న ప్రసాదాల నాణ్యతపై భక్తుల ప్రశంసలు



తిరుమల (ప్రశ్న న్యూస్) కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామివారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులకు అత్యుత్తమ నాణ్యతతో కూడిన అన్నప్రసాదాలు అందించడమే టీటీడీ ప్రధాన లక్ష్యమని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలియజేశారు. తిరుమలలోని శ్రీ పద్మావతి అతిథి గృహం సుధర్మ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం ఆయన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రైస్, దాల్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ముడి దినుసుల సరఫరాలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఇటీవల భక్తుల నుంచి నిర్వహించిన అభిప్రాయ సేకరణలో దాదాపు 98 శాతానికి పైగా భక్తులు గతంతో పోల్చితే ప్రస్తుతం అందిస్తున్న అన్నప్రసాదం రుచి, నాణ్యత గణనీయంగా మెరుగుపడిందని పేర్కొన్నారని అదనపు ఈవో తెలిపారు. అలాగే సోమవారం రాత్రి రైస్ మిల్లర్లు స్వయంగా అన్నప్రసాద కేంద్రంలో భక్తులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకోగా, అధిక శాతం మంది భక్తులు అన్నప్రసాద నాణ్యత, రుచిపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. అభిప్రాయ సేకరణలో కొందరు భక్తులు అన్నప్రసాదంతో పాటు అదనంగా పప్పును కూడా వడ్డిస్తే మరింత బాగుంటుందని సూచించారని తెలిపారు. ఈ సూచనను సానుకూలంగా పరిగణించి, అందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు ఈవో ఆదేశించారు. టీటీడీ నూతనంగా ప్రవేశపెడుతున్న ఎంపానల్ వ్యవస్థ ద్వారా ముడి పదార్థాల కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత, నాణ్యత ప్రమాణాలను మరింత పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ విధానం ద్వారా భక్తులకు అందించే అన్నప్రసాదం నాణ్యతను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. టీటీడీకి అవసరమైన వివిధ రకాల పప్పు దినుసులను కూడా దాల్ అసోసియేషన్ ద్వారా సరఫరా చేసే అంశంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా టీటీడీ నియమ నిబంధనలకు అనుగుణంగా భక్తులకు అత్యుత్తమ నాణ్యత గల ఆహార పదార్థాలు అందించే దిశగా విధివిధానాలు రూపొందిస్తున్నామని అదనపు ఈవో చెప్పారు. ఈ అంశాన్ని టీటీడీ పాలక మండలి సమావేశంలో చర్చించి, త్వరలో తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో వేర్ హౌజ్ డిప్యూటీ ఈవో పద్మావతి, ప్రొక్యూర్ మెంట్ విభాగాధిపతి ఉమా శంకర్, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి, ఇతర అధికారులు, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణకు చెందిన రైస్, దాల్ మిల్లర్లు పాల్గొన్నారు

# ఆపరేషన్ క్లీన్ స్వీప్‌తో పలాస-కాశీబుగ్గలో పారిశుద్ధ్యానికి పెద్దపీట: కమిషనర్ శ్రీనివాసులు



పలాస-కాశీబుగ్గ(ప్రశ్న న్యూస్) పురపాలక సంఘం పరిధిలో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నారు. శుభ్రమైన రోడ్లు, శుభ్రమైన కాలువలు, శుభ్రమైన పరిసరాల లక్ష్యంతో యం ఎల్ ఎ గౌతు శిరీష ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని కాశీబుగ్గ ఓల్డ్ చీఎ 5 రోడ్ లో అక్కుపల్లి జంక్షన్ నుండి 3 రోడ్ల జంక్షన్ వరకు గల మేజర్ కాలువపై ఉన్న అన్ని ఆక్రమణలను తొలగించి కాలువలో పేరుకుపోయిన సిల్ట్, చెత్తాచెదారాన్ని తొలగించే కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ చర్యల ద్వారా వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చేయడంతో పాటు నీటి నిల్వలు, దోమల వ్యాప్తి వ్యాధుల ప్రమాదాన్ని నివారించేందుకు కృషి చేస్తున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రమైన వాతావరణం కోసం పారిశుద్ధ్య కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే పట్టణ ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి మున్సిపాలిటీ చేపడుతున్న కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా చారిత్రాత్మక అడుగు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మహిళలు సంక్షేమ పథకాల లబ్ధిదారులుగానే కాకుండా ఆస్తుల యజమానులు, వ్యాపారవేత్తలు, సంపద సృష్టికర్తలు, ఆర్థిక వ్యవస్థకు నాయకత్వం వహించే స్థాయికి ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు.
మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మండల మహిళా సమాఖ్యలు కొనుగోలు చేసిన 553 టీజీఎస్ఆర్టీసీ బస్సులను సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో హాజరైన మహిళా సంఘాల సభ్యులను ఉద్దేశించి మాట్లాడిన ముఖ్యమంత్రి, మహిళలు సమాజంలో సగం, ఆకాశంలో సగం అని పేర్కొంటూ అభివృద్ధి ఫలితాలలో కూడా వారికి సమాన భాగస్వామ్యం ఉండాలని అన్నారు. మహిళలను రుణగ్రహీతల స్థాయి నుంచి ఆస్తుల యజమానుల స్థాయికి తీసుకువెళ్లే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 553 మండల మహిళా సమాఖ్యలు రూ.199.08 కోట్ల పెట్టుబడితో 553 బస్సులను కొనుగోలు చేసి టీజీఎస్ఆర్టీసీకి లీజుకు ఇచ్చాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, గణేష్, మల్‌రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి, తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కలువ సుజాత గుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు దాన కిషోర్, వికాస్ రాజ్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఎం. హరీష్ ముకుంద్ రెడ్డి, టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, మహిళా సమాఖ్యల ప్రతినిధులు, అధికారులు , రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు చేనేతతో తయారు చేసిన శాలువాలే అందించాలి

- మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం సమర్పించిన : పద్మశ్రీ కళాకారుడు గజం అంజయ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో భక్తులకు ఆశీర్వచనంగా చేనేత రంగం ద్వారా తయారు చేసిన శాలువాలను మాత్రమే అందించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ చేనేత కళాకారుడు గజం అంజయ్య అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ మంత్రి కొండా సురేఖ ని కోరారు. ఈ మేరకు మంత్రి కొండా సురేఖ ని ఈ రోజు జూబ్లిహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా చేనేతకారులు స్వచ్ఛమైన నూలుతో తయారైన శాలువాతో మంత్రి ని సత్కరించారు. యాదాద్రి, భద్రాచలం, బాసర, వేములవాడ తదితర ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, సేవల్లో పాల్గొనే భక్తులకు అందించే శాలువాలు ప్రస్తుతం పెద్దమొత్తంలో మరమగ్గాలు, మిల్లుల్లో కృత్రిమ నూలుతో తయారవుతున్నాయని ఆయన మంత్రి సురేఖ కి వివరించారు. ఈ కార్యక్రమంలో చేనేత రంగానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలి

- క్రైస్తవ సంక్షేమంపై కేసీఆర్ నిబద్ధతకు నివేదిక నిదర్శనం
- క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి : మాణిక్యాల శ్రీనివాస్
- ఢిల్లీలో దళిత క్రిస్టియన్ల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం..!
- కమీషన్ కు సమగ్ర నివేదిక అందజేత...!!



భీంగల్ (ప్రశ్న న్యూస్) దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో ఢిల్లీలోని జాతీయ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ కె.జి. బాలక్రిష్ణన్ ను బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందం మంగళవారం కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సమావేశంలో మండలంలోని బాబానగర్ కు చెందిన క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.దళిత క్రైస్తవులపై కొనసాగుతున్న వివక్ష, సామాజిక-ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నివేదికను బీఆర్ఎస్ ప్రతినిధులు అందజేశారు. ఈ బృందంలో వద్దిరాజు రవిచంద్ర, కొప్పుల ఈశ్వర్, ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, రాజీవ్ సాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాణిక్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ, దళిత క్రైస్తవుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ కమిషన్‌కు నివేదిక సమర్పించడం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ఇదే అంశంపై ఇతర రాజకీయ పార్టీలు మౌనం వహించడం విచారకరమని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం క్రైస్తవుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపట్టిన ఘనత టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) పార్టీకే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు బిషప్ విద్యా సాగర్, మోసెస్, సాలోమాన్, బిషప్ దుర్గం ప్రభాకర్, రమేష్ జాన్, తదితరులు పాల్గొన్నారు.



## ఆయన నటన గురించి మాటల్లో చెప్పలేను

# సంయుక్త మీనన్

మలయాళం, తెలుగు చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న నటి సంయుక్త మీనన్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతిపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆయనతో కలిసి 'స్లమ్‌డాగ్ -- 33 టెంపుల్ రోడ్' చిత్రంలో నటిస్తున్న ఆమె, విజయ్ నటనను ప్రత్యక్షంగా చూడటం ఒక అద్భుతమైన అనుభూతి అని తెలిపారు. ఆయన సెట్‌లో ఉన్నప్పుడు, తెరపై చూసేదానికంటే భిన్నమైన శక్తిని తీసుకొస్తారని ఆమె అభిప్రాయపడ్డారు. విజయ్ సేతుపతితో కలిసి పనిచేయడం గురించి సంయుక్త మాట్లాడుతూ, "నేను విజయ్ సర్‌కు పెద్ద అభిమానిని. ఆయన నటనను దగ్గర నుంచి చూడటం మాటల్లో చెప్పలేను. ఒక పాత్రలోకి ఆయన మారే తీరు చాలా సహజంగా ఉంటుంది. డైలాగ్స్ చెబుతుంటే, అవి నిజంగా తనలో నుంచే వస్తున్నట్లు అనిపిస్తుంది. ఒక సహనటిగా ఆ ప్రక్రియను చూడటం నాకు దక్కిన అదృష్టం" అని వివరించారు.'స్లమ్‌డాగ్' చిత్రంలో తన పాత్ర గురించి చెబుతూ, "ఇందులో నా పాత్ర చాలా అందమైనది, ఎన్నో విభిన్న కోణాలు ఉంటాయి. నటిగా ఇది నాకు ఒక పెద్ద సవాల్. ఇలాంటి ప్రత్యేకమైన పాత్ర చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది" అని సంయుక్త మీనన్ అన్నారు. ఈ చిత్ర దర్శకుడు పూరి జగన్నాథ్ పనితీరును కూడా సంయుక్త మెచ్చుకున్నారు. "పూరి సర్ దర్శకత్వం చేసే విధానం చాలా స్టైలిష్‌గా, అందంగా ఉంటుంది. ఆయన సమయానికి షూటింగ్ మొదలుపెట్టి, అనుకున్నదానికంటే ముందే పూర్తి చేస్తారు. ఆయన పనితీరు చూడటం ఎంతో అద్భుతంగా అనిపిస్తుంది" అని తెలిపారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలో విడుదల కానుంది.

# 'వలవార' మూవీ రివ్యూ!




కన్నడలో రూపొందిన ఒక ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామానే 'వలవార'. ఈ ఏడాది జనవరి 30వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఇప్పుడు 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. సతన్ గౌడ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఇప్పుడు కన్నడతో పాటు తెలుగులోను అందుబాటులోకి వచ్చింది. గిరిధర్ – అనిరుధ్ గౌతమ్ నిర్మించిన ఈ సినిమాలో, మాస్టర్ వేద కౌశల్ ప్రధానమైన పాత్రను పోషించాడు. అది పట్టణానికి దూరంగా ఉన్న ఒక మారుమూల పల్లె. ఆ గ్రామంలో కుందేశి (కౌశల్) అతని తల్లిదండ్రులు .. తమ్ముడు 'కొసుడి' నివసిస్తూ ఉంటారు. ఊరికి దూరంగా .. పంటపొలాలకు దగ్గరగా ఉన్న ఇల్లు వారిది. కుందేశిపట్ల తండ్రి చాలా కోపంగా వ్యవహరిస్తూ ఉంటాడు. అందువలన అతను తండ్రికి భయపడుతూ ఉంటాడు. తండ్రి చేతిలో కుందేశి దెబ్బలు తింటాడేమోనని తల్లి కూడా ఆందోళన చెందుతూ ఉంటుంది. ఇలాంటి పరిస్థితులలో ఒక ముఖ్యమైన పనిపై కుందేశి తండ్రి పట్నం వెళతాడు. అదే సమయంలో కుందేశి .. అతని తమ్ముడు 'గౌరీ' అనే తమ ఆవును మేపుకు రావడానికి వెళతారు. కుందేశి తమ్ముడి నిర్లక్ష్యం కారణంగా ఆవు కనిపించకుండా పోతుంది. అది వేరేవారి చేలోపడి మేయడంతో, వాళ్లు దానిని తమ కొట్టంలో కట్టేస్తారు. 200 రూపాయలు ఇచ్చి ఆవును తీసుకుని వెళ్లమని కుందేశితో చెబుతారు. కుందేశి విషయం చెప్పడంతో, అతని తల్లి చేబదులుగా పక్కింటావిడ దగ్గర 200 రూపాయలు తీసుకుని ఇస్తుంది. తండ్రి పట్నం నుంచి వచ్చేసరికి ఆవు ఇంట్లో ఉండాలి. పైగా అది సూడి ఆవు కావడంతో కుందేశి మరింత భయపడతాడు. ఆవును కట్టేసిన ఇంటికి వెళ్లిన అతను, తల్లి తనకి ఇచ్చిన 200 రూపాయల నోటు ఎక్కడో పడిపోయిందనే విషయాన్ని గ్రహిస్తాడు. వెనక్కి వెళ్లి ఎంతగా వెదికినా ఆ నోటు కనిపించదు. అప్పుడు కుందేశి ఏం చేస్తాడు? తండ్రి వచ్చేలోగా ఆవును విడిపించగలుగుతాడా? అతనిపై తండ్రికి గల కోపానికి కారణం ఏమిటి? అనేది కథ. విలేజ్ లలో ఆవును తమ కుటుంబంలో ఒక సభ్యుడిగా భావిస్తూ ఉంటారు. ఆవు తప్పిపోతే తమ కుటుంబ సభ్యుడు కనిపించకుండా పోయినంతగా కంగారు పడిపోతారు. ఆవు కోసం తలో దిక్కుకు వెళ్లి వెదకడం మొదలు పెడతారు. ముఖ్యంగా ఆ ఇంట్లోని పిల్లలు ఆవుని మరింతగా ప్రేమిస్తూ ఉంటారు. అలా ఒక పిల్లాడికి .. తప్పిపోయిన ఆవుకు మధ్య నడిచే కథ ఇది. ఈ కథ అంతా కూడా విలేజ్ నేపథ్యంలోనే కొనసాగుతుంది. కుందేశి ఓ పదేళ్ల పిల్లాడు. తండ్రి అంటే విపరీతమైన భయం. తండ్రి ఇంట్లో లేని సమయంలో ఆవు తప్పిపోతోంది. అతను వచ్చేలోగా ఆవును వెదికి తీసుకురావడం కోసం ఆ పిల్లాడు పడే ఆరాటం చుట్టూనే ఈ కథ తిరుగుతూ ఉంటుంది. విలేజ్ నేపథ్యం .. పేద కుటుంబం .. ఆర్థిక ఇబ్బందులు ..కుందేశి బర్త్ డేకి కేక్ కట్ చేయించాలానే తల్లి ముచ్చటతో పాటు, ఈ మధ్యలో చోటు చేసుకునే ఒక చిన్న లవ్ ట్రాక్ ను కలుపుకుంటూ ఈ కథ ముందుకు వెళు తుంది. విలేజ్ నేపథ్యం .. కుర్రాడి వైపు నుంచి ఉన్న ఆవు ఎమోషన్ కారణంగా ఈ కంటెంట్ ఆసక్తికరంగా ఉంటుందని అనుకోవడం సహజం. కానీ బలహీనమైన కథాకథనాలతో .. తేలికపాటి సన్నివేశాలతో ఈ కథ కదులుతుంది. తల్లీ కొడుకు మధ్య .. కొడుకు పట్ల తండ్రి కోపానికి గల కారణం .. ఆవు పట్ల పిల్లాడికి గల ప్రేమ .. ఇవేవీ ఆడియన్స్ కి కనెక్ట్ కావు. ఆ ఫీల్ ను వర్కౌట్ చేయలేకపోయారు. బలమైన .. బరువైన సన్నివేశాలను డిజైన్ చేసుకోలేకపోయారు. ఆర్టిస్టుల నుంచి సరైన అవుట్ పుట్ తీసుకోకుండా పైపైన చుట్టేసినట్టుగా అనిపిస్తుంది. ఈ సినిమాలో ఆకట్టుకునే అంశాలు ఏవైనా ఉన్నాయంటే అవి లొకేషన్స్ అని చెప్పాలి. గ్రామీణ నేపథ్యంలోని లొకేషన్స్ ను కవర్ చేసిన విధానం అలరిస్తుంది. చందమామ కథల్లోని దృశ్యాల మాదిరిగా అందమైన లొకేషన్స్ మనసుకు హత్తుకుపోతాయి.

ఆ లొకేషన్స్ కి వెళ్లాలనిపించేలా ఉన్నాయి. అయితే ఆ లొకేషన్స్ లో నడిచే కథపై కసరత్తు జరగకపోవడం కనిపిస్తుంది .. నిరాశను కలిగిస్తుంది. ప్రధానంగా కనిపించేది 6 పాత్రలే. వారి నటన ఫరవాలేదు. ఫొటోగ్రఫీ మెప్పిస్తుంది .. లొకేషన్స్ ను తెరపైకి తీసుకొచ్చిన విధానం వైపు నుంచి ఎక్కువ మార్కులు ఇస్తుంది. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. బలమైన కంటెంట్ ను రాసుకోకుండా సినిమా స్థాయి నిడివికి సాగదీసినట్టుగా కనిపిస్తుంది. సింపుల్ లైన్ ను తీసుకున్నప్పటికీ, కసరత్తు బలంగా చేసుంటే మరింత బెటర్ అవుట్ పుట్ వచ్చేదని అనిపిస్తుంది.

# భారీ స్కామ్..

## సన్నీ లియోన్‌కు సీఐడీ నోటీసులు



బాలీవుడ్ హాట్ బ్యూటీ సన్నీ లియోన్ ఒక భారీ ఆర్థిక వివాదంలో చిక్కుకోవడం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. కర్ణాటకకు చెందిన 'శివమ్ అసోసియేట్స్' అనే సంస్థ దాదాపు రూ.2,400 కోట్ల మేర అక్రమ డిపాజిట్లు సేకరించి, ప్రజలను మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఈ సంస్థ యజమాని శివానంద నీలణ్ణవర్‌పై ఇప్పటికే కేసులు నమోదు కాగా, ఈ అక్రమ సొమ్ము వ్యవహారంలో సన్నీ లియోన్‌కు కర్ణాటక సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది.దశివమ్ అసోసియేట్స్ అధినేత 2023లో 'ఛాంపియన్' అనే సినిమాను నిర్మించాడు. ఈ చిత్రంలో ఒక ఐటెం సాంగ్ చేసినందుకు సన్నీ లియోన్‌కు ఏకంగా రూ.1 కోటి పారితోషికం ఇచ్చినట్లు బ్యాంక్ రికార్డుల ద్వారా అధికారులు గుర్తించారు. ప్రజల నుంచి వసూలు చేసిన అక్రమ సొమ్మునే ఆమెకు రెమ్యూనరేషన్‌గా ఇచ్చారా అనే కోణంలో ఆరా తీస్తున్న పోలీసులు... దీనిపై పూర్తి వివరణ ఇవ్వాల్సిందిగా కోరుతూ ఆమెకు నోటీసులు పంపారు. ఈ సంస్థ ప్రజల సొమ్ముతో గత డిసెంబరులో నిర్వహించిన 'కన్నడ ఉత్సవం' వేడుకల్లో పలువురు సినీ నటులు పాల్గొన్నారు. ఈ క్రమంలో ఈవెంట్‌లో పాల్గొన్నందుకు భారీగా పారితోషికాలు అందుకున్నారనే అనుమానంతో కన్నడ నటులు 'డాలి' ధనుంజయ్, సప్తమీ గౌడ (కాంతార ఫేమ్), వశిష్ఠ సింహా, రాగిణి ద్వివేదిలకు కూడా నోటీసులు ఇచ్చేందుకు సీఐడీ సిద్ధమైంది.

# 'కేడీ .. ది డెవిల్' మూవీ రివ్యూ!



మాస్ యాక్షన్ హీరోగా కన్నడలో ధృవ్ సర్జాకి మంచి పేరు ఉంది. అలాంటి ధృవ్ సర్జా నుంచి మరో యాక్షన్ మూవీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రేమ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 15వ తేదీన థియేటర్లలో విడుదలైంది. సంజయ్ దత్ .. శిల్పా శెట్టి కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమాలో కిచ్చా సుదీప్ అతిథి పాత్రను పోషించాడు. జూన్ 5వ తేదీ నుంచి 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. కన్నడతో పాటు తెలుగు .. తమిళ .. మలయాళ భాషల్లో అందుబాటులో ఉంది.కాళిదాస్ (ధృవ్ సర్జా) బెంగుళూర్ సమీపంలోని ఒక విలేజ్ లో తన అన్నయ్య ధర్మ (రమేశ్ అరవింద్)తో కలిసి నివసిస్తూ ఉంటాడు. ధర్మ వివాహం చేసుకోడు. ఆ విలేజ్ లోని పిల్లలకు చదువు చెబుతుంటాడు. అందువలన ఆయనను అందరూ అభిమానిస్తూ ఉంటారు. కాళిదాస్ కి చిన్నప్పటి నుంచి చదువు అబ్బకపోవడంతో, కిరోసిన్ డీలర్ గా పనిచేస్తూ ఉంటాడు. అన్నయ్య అంటే ఆయనకి ప్రాణం. కండబలం ఉన్నప్పటికీ, అన్నయ్య చెప్పిన మార్గంలో నడుస్తుంటాడు. ఆ ఊరు కుస్తీ పోటీలకు ప్రసిద్ధి. అయితే దేవా (సంజయ్ దత్)తో కుస్తీ ఆడటానికి ఎవరైనా భయపడాల్సిందే. మాఫియాతో లింకులున్న దేవా, ఆ కుస్తీ గ్రౌండ్ నుంచి తన అనుచరులను తయారు చేయడం మొదలుపెడతాడు. వాళ్లను తన ముఠాలో చేర్చుకుంటూ ఒక ప్రత్యేకమైన గ్యాంగ్ ను తయారు చేస్తాడు. అక్కడి ప్రజలకు తానంటే ఉన్న భయాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయంగా ఎదగాలనే ప్రయత్నాలలో ఉంటాడు.కాళిదాస్ తన అన్నయ్య ధర్మాతో పాటు, మరో ఇద్దరిని తన జీవితంలో ముఖ్యమైన వ్యక్తులుగా భావిస్తుంటాడు. ఒకరు తనకి చిన్నప్పుడు రక్తమిచ్చి బ్రతికించిన దేవా అయితే, మరొకరు తాను ఇష్టపడిన కొడవలి లక్ష్మి (రీష్మా). దేవాతో పటు ఆమె భార్య అయిన సత్యవతి (శిల్పా శెట్టి)ని కూడా కాళిదాస్ ఎంతో గౌరవిస్తుంటాడు. దేవా చేసే అరాచకాలకు సత్యవతి పూర్తి సపోర్టు ఉంటుంది. అతను తీసుకునే నిర్ణయాలు సరైనవిగా ఆమె భావిస్తూ ఉంటుంది. ఒకానొకసారి కుస్తీలో దేవా ఆటతీరును కాళిదాస్ తప్పుబడతాడు. ఎలా ఆడాలో చెబుతూ, దేవాను ఓడిస్తాడు. అప్పుడు జరిగిన అవమానాన్ని దేవా మనసులో పెట్టుకుంటాడు. సత్యవతి కూడా లోలోపలే రగిలిపోతూ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే దేవా మనుషుల కారణంగా లక్ష్మికి అవమానం జరుగుతుంది. అప్పుడు కాళిదాస్ ఏం చేస్తాడు? అన్నిరకాలుగా బలవంతుడైన దేవాను అతను ఎలా ఎదుర్కొంటాడు? ధర్మ పెళ్లి చేసుకోకుండా ఉండిపోవడానికి కారణం ఏమిటి? అనేది మిగతా కథ. ఈ కథ 1980లలో మొదలవుతుంది. ఒక మాఫియా ముఠా నాయకుడికీ .. అమాయకుడైన ఒక సాధారణ యువకుడికి మధ్య జరిగే కథ ఇది. ఎన్నో అరాచకాలు చేస్తూ వెళుతున్న దేవాను, తనకి ఒక చిన్న సాయం చేసిన కారణంగా మంచివాడిగా భావిస్తూ ఉంటాడు కాళిదాసు. అయితే అదే దేవా కారణంగా తన కుటుంబం ప్రమాదంలో పడినప్పుడు కాళిదాస్ ఏం చేస్తాడు? అనే ఒక అంశం చుట్టూ ఈ కథ తిరుగుతూ ఉంటుంది. సమర్థులైనవారు .. బలవంతులు సహనంతో ఉండటం చాలా అరుదు. తమచుట్టూ ఉన్నవాళ్లలోను మంచితనాన్ని మాత్రమే చూస్తూ సర్దుకుపోతుంటారు. అలాంటివారిని రెచ్చగొడితే ఏం జరుగుతుంది? మంచివారి కోపం ఎంత తీవ్రంగా ఉంటుంది? తమ కుటుంబం కోసం ఎంతకష్టమైనా పడే అలాంటివాళ్లు, ఆ కుటుంబమే ఆపదలో పడే పరిస్థితి వస్తే ఎలా రియాక్ట్ అవుతారు? అనే అంశాన్ని కేంద్రబిందువుగా చేసుకుని దర్శకుడు ఈ కథను ముందుకు తీసుకుని వెళ్లాడు. హీరో వైపు నుంచి చూస్తే, అన్నకోసం ప్రాణాలు ఇవ్వడానికి వెనుకాడని ఒక తమ్ముడు. విలన్ వైపు నుంచి చూస్తే తన భర్తను సపోర్ట్ చేసే విలన్ భార్య సత్యవతి. ఈ రెండు కుటుంబాలకు మధ్యలో 'లక్ష్మి' అనే హీరోయిన్ పాత్ర. ఈ ఐదు పాత్రల చుట్టూనే ప్రధానమైన సన్నివేశాలు ప్లే అవుతూ ఉంటాయి. కథా పరంగా చూసుకుంటే, ఏ మాత్రం కొత్తదనం లేకుండా ఒక రెగ్యులర్ ఫార్ములాను ఫాలో అవుతూ వచ్చిన సినిమానే ఇది. ఫస్టాఫ్ లో చాలావరకూ కథను సాగదీస్తూ వెళ్లారు. అలా ఎందుకు చేశారనేది మనకి సెకండాఫ్ చివరో తెలుస్తుంది. సీక్వెల్ కోసమని ఉన్న కథను దాచడానికి చేసిన ప్రయత్నం తాలూకు ప్రభావం ఫస్టాఫ్ పై పడిపోయింది. అలా కాకుండా ఇదే సినిమాలో చెప్పేసి ఉంటే, ఇంపాక్ట్ వేరేలా ఉండేదే. ఎందుకంటే సత్యవతి పాత్ర తాలూకు ఛాయలు అలా కనిస్తాయి. ఆ పాత్ర రంగంలోకి దిగడంతో సీక్వెల్ రానున్నట్టు చూపించారు. ఇక ఫస్టాఫ్ లో హీరో – హీరోయిన్ మధ్య ప్రేమను పాటల్లో చూపిస్తే బాగుండేది. లేదంటే ఎమోషనల్ గా కనెక్ట్ చేసినా బాగుండేది. కానీ ఈ రెండు పాత్రల మధ్య అతివాగుడు పెట్టేసి, ఆడియన్స్ తో ఒక ఆట ఆడుకున్నారు. ఈ వయసులో సంజయ్ దత్ కుస్తీలు .. భవతి బిక్షామ్ దేహి అంటూ సత్యవతి పోలీస్ స్టేషన్ కి రావడం .. భైరవ పాత్రలో సుదీప్ ఎంట్రీ .. కాస్త ఓవర్ గా అనిపిస్తాయి. ఇక రవిశంకర్ పాత్రను పోలీస్ ఆఫీసర్ గా కాకుండా, ఎక్కడికక్కడ హీరో గురించి గొప్పలు చెప్పే పాత్రలో చూపించారు. ఆర్టిస్టులంతా పాత్ర పరిధిలో నటించారు. విలియం డేవిడ్ ఫొటోగ్రఫీ .. అర్జున్ జన్య సంగీతం .. సంకేత్ ఆచార్ ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. 'కేడీ .. ది డెవిల్' టైటిల్ కి తగినట్టుగానే హింసతో .. రక్తపాతంతో నడిచే కథ ఇది. విలన్ కంటే ఎక్కువ హింసకి పాల్పడే హీరో చేష్టలతో .. రొటీన్ కథాకథనాలతోనే నడిచే కంటెంట్ ఇది.

## నాని 'ది పారడైజ్' మళ్లీ వాయిదా?

## రవితేజ 'ఇరుముడి' కోసమేనా!




నాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ది పారడైజ్' మరోసారి వాయిదా పడే దిశగా కనిపిస్తోంది. మొదట మార్చి 26న విడుదల కావాల్సిన ఈ చిత్రం, ఆ తర్వాత ఆగస్టు 21కి వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆ ఆగస్టు 21వ తేదీని మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న 'ఇరుముడి' సినిమా లాక్ చేసుకోవడంతో నాని సినిమా పోస్ట్‌పోన్ కాక తప్పని పరిస్థితి ఏర్పడింది. సినిమాకు సంబంధించిన కొంత వర్క్ ఇంకా పెండింగ్‌లో ఉండటమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. సోషల్ మీడియాలో వినిపిస్తున్న తాజా సమాచారం ప్రకారం.. 'ది పారడైజ్' చిత్రం సెప్టెంబర్ నెలలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఇది కేవలం ప్రచారం మాత్రమేనని, దీనిపై చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన రావాల్సి ఉందని ఇండస్ట్రీ టాక్. బ్లాక్‌బస్టర్ 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది పారడైజ్' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఎస్–ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాయాడు లోహర్ హీరోయిన్ గా నటిస్తుండగా, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నాడు.

# వారాహి అమ్మవారి శాపం వెనుక దాగిన రహస్యం..

### థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఆకట్టుకున్న 'మహేంద్రగిరి వారాహి' టీజర్!




తెలుగు ప్రేక్షకులకు మరో ఆసక్తికరమైన డివోషనల్ థ్రిల్లర్‌ను అందించేందుకు సిద్ధమవుతోంది 'మహేంద్రగిరి వారాహి'. సుమంత్, మాళవిక నాయర్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి గోస్వామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు సంతోష్ జాగర్లపూడి తెరకెక్కిస్తున్నారు. రాజశ్యామల ఎంటర్టైన్మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై మధు కలిపు, వెంకట్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, అలీ, రాజీవ్ కనకాల తదితర ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ విడుదల చేయగా, అది ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. టీజర్ ఆరంభం నుంచే మిస్టరీ, భక్తి, ఉత్కంఠభరిత అంశాలతో కథపై అంచనాలను పెంచేసింది. మహేంద్రగిరి అనే గ్రామం, అక్కడి ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్న వారాహి అమ్మవారి ఆరాధన, అలాగే ఒక వంశాన్ని వెంటాడుతున్న శాపం చుట్టూ కథ తిరుగుతున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది.తెలుగు వార్తలు టీజర్‌లో చూపించిన విజువల్స్, గ్రామీణ నేపథ్యంలో నెలకొన్న భయానక వాతావరణం, దేవతా శక్తులతో ముడిపడిన సంఘటనలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఒక రహస్యాన్ని ఛేదించేందుకు మహేంద్రగిరికి వచ్చిన హీరో పాత్ర కథలో కీలక మలుపులు తీసుకురానుందని సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆ రహస్యానికి వారాహి అమ్మవారి శాపంతో ఉన్న సంబంధం ఏమిటి? గ్రామంలో జరుగుతున్న విచిత్ర ఘటనల వెనుక అసలు కారణం ఏమిటి? అనే ప్రశ్నలను టీజర్ ప్రేక్షకుల ముందుంచింది. సుమంత్ పాత్ర చాలా సీరియస్ మరియు ఇన్వెస్టిగేటివ్ షేడ్‌లో కనిపించగా, మాళవిక నాయర్, ఐశ్వర్య రాజేష్ పాత్రలు కూడా కథలో బలమైన ప్రాధాన్యం కలిగి ఉన్నట్లు అర్థమవుతోంది. మరోవైపు బ్రహ్మానందం, వెన్నెల కిషోర్ వంటి నటులు తమ పాత్రల ద్వారా కథకు అవసరమైన వినోదాన్ని జోడించే అవకాశం కనిపిస్తోంది.

# ఇసుక అనుమతుల జాప్యంతో నిర్మాణ రంగానికి ఇబ్బందులు

**- ఏఐటీయూసీ నేత : కడారి రాములు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో మంగళవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ, వేములవాడ మూలవాగు నుంచి ఇసుక తవ్వకాలకు అధికారులు అనుమతులు ఇస్తున్నారని తెలిపారు. అయితే ఇసుక తవ్వకాల ప్రాంతం రైతుల వ్యవసాయ బావులకు సమీపంలో ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మూలవాగు స్థానంలో సంకెపల్లి వాగు నుంచి ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని అధికారులను కోరారు. అలాగే ప్రస్తుతం ఇసుక, మొరం, మట్టి తరలింపునకు నెలకు ఒకసారి లేదా 15 రోజులకు ఒకసారి మాత్రమే అనుమతులు ఇస్తుండటంతో భవన నిర్మాణ కార్మికులు, ఇంటి యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నిర్మాణ రంగం పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రతిరోజూ ఇసుక,మొరం,మట్టి తరలింపునకు అనుమతులు మంజూరు చేయాలని ప్రభుత్వం, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. దీంతో కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజలకు నిర్మాణ పనుల్లో ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**- అదనపు కలెక్టర్ : గడ్డం నగేష్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రి, నమిలిగుండుపల్లి గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోళ్ల పురోగతి,ధాన్యం తరలింపు,ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీలు,టార్పాలిన్ల అందుబాటు తదితర అంశాలను పరిశీలించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా వాహనాలు సమకూర్చాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు రైతులు లాభదాయక పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.

# వెన్నుపోటు పార్టీలపై సమర భేరి

**- అనంత వెంకటరామిరెడ్డి**

**కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి**

**పంచాయతీలకు కేంద్రాలుగా పోలీస్‌స్టేషన్లు**

**అక్రమ కేసులకు ఎవరూ భయపడొద్దు**

**వైఎస్ఆర్‌సీపీ శ్రేణులకు అనంత వెంకటరామిరెడ్డి దిశానిర్దేశం**




అనంతపురం (ప్రశ్న న్యూస్ ) కూటమిలో భాగస్వాములుగా ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు వెన్నుపోటు పార్టీలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. మూడు పార్టీలు కలిసికట్టుగా ప్రజలతో ఓట్లు వేయించుకుని చివరకు వాళ్లకే వెన్నుపోటు పొడిచాయని మండిపడ్డారు. 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేయని హామీలు, ప్రజా సమస్యలపై మంగళవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త, జిల్లా అధ్యక్షులు అనంత ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, నగర కమిటీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు రెండేళ్ల పాలనపై అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న ఐదేళ్ల పాటు రాష్ట్ర ప్రజలకు సంక్షేమాన్ని అందించారని తెలిపారు. 25కి పైగా సంక్షేమ పథకాలతో నేరుగా డీబీటీ ద్వారా రూ.2.73 లక్షల కోట్లు అందించినట్లు చెప్పారు.

నాన్ డీబీటీతో కలిపి ఏకంగా రూ.4.58 లక్షల కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు కొనసాగించడంతో పాటు సూపర్ సిక్స్ పథకాలు అందిస్తామని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రచారం చేశారన్నారు. రెండేళ్ల పాలనలో జగన్ అందించిన సంక్షేమ పథకాలను ఎత్తేయడంతో పాటు సూపర్ సిక్స్ హామీల అమలులోనూ వైఫల్యం చెందారని అన్నారు. రెండేళ్లుగా అనంతపురం నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలిచి చేసిన పోరాటాలను గుర్తు చేసేలా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

# అంగరంగ వైభవంగా పైడితల్లి అమ్మవారి పండుగ

**- అమ్మవారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు**

**- అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించిన గంట్ల దంపతులు**

**- ఆలయం వద్ద ప్రసాద వితరణ శీతల పానీయాలు పంపిణీ**



సింహాచలం (ప్రశ్న న్యూస్) సింహాద్రి నాథుడి సోదరి ఏడు గ్రామాల ప్రజల ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా జూన్ రెండో వారంలో నిర్వహించే ఈ పండుగను ఈ ఏడాది కూడా సింహాచలం దేవస్థానం పూజారి వంశీయులు లండ వారు గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిపించారు. తెల్లవారుజామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన గావించారు అప్పటికే క్యూ లైన్ల లో ఉన్న వేలాది మంది భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చిన భక్తులంతా అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించుకుని ముడుపులు మొక్కుబడులు చెల్లించుకున్నారు.. పైడితల్లి అమ్మవారితో పాటు మరో సోదరి బంగారమ్మ వారిని కూడా భక్తులంతా దర్శించుకోవడం జరిగింది.. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సింహాచలం దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

**అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించిన గంట్ల దంపతులు**

సింహాద్రి నాథుడి సోదరీమణులు శ్రీ పైడితల్లమ్మ బంగారమ్మవార్లకు పండుగ మహోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ సత్తెమ్మ తల్లి.. మరిడిమాంబ అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షులు సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు.. ప్రత్యేక ఆహ్వానితులు.. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు దంపతులు నూతన వస్త్రాలు సమర్పించారు.. మహిమాన్వితమైన అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు..

**ప్రసాద వితరణ.. శీతల పానీయాలు పంపిణీ**

శ్రీ గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు ప్రసాద వితరణ.. అలాగే శీతల పానీయాలు భక్తులకు కమిటీ సభ్యులు పంపిణీ చేశారు.. శ్రీ గణేష్ యువజన సేవా సంఘం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు కూడా పాల్గొన్నారు

# భారత్ చీకటి నుంచి విద్యుత్ మిగులు దేశంగా మారింది

**- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి**



తిరుపతి (ప్రశ్న న్యూస్ ) ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల పాలనలో దేశం విద్యుత్ కొరత నుంచి విద్యుత్ మిగులు దేశంగా ఎదిగిందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ప్రజా పంపిణీ, నూతన పునరుత్పాదక ఇంధన శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. తిరుపతి నగరంలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "విశ్వాసానికి, అభివృద్ధికి, జనకళ్యాణానికి 12 సంవత్సరాలు" కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ విజయాలను వివరించారు.2014కు ముందు దేశంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 123 గిగావాట్లు ఉన్న సమయంలో ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాలు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడ్డాయని, అయితే మోదీ ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది మే 23న నమోదైన 280 గిగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను విజయవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. ప్రస్తుతం దేశ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 538 గిగావాట్లకు చేరుకోగా, అందులో 33 శాతం పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే వస్తోందని చెప్పారు.పునరుత్పాదక ఇంధన రంగంలో 290 గిగావాట్ల స్థాపిత సామర్థ్యంతో భారత్ అమెరికాను అధిగమించిందని, సౌరశక్తి మరియు పవనశక్తి రంగాల్లో ప్రపంచంలో వరుసగా మూడో, నాలుగో స్థానాల్లో నిలిచిందని పేర్కొన్నారు.

# ప్రభుత్వ బడి.. ఇంటర్నేషనల్ స్టడీ

**మూలపేట డీఎస్ఆర్ స్కూల్‌ను పరిశీలించిన పొంగూరు షరిణి**

**స్కూల్ పనులను స్వయంగా పర్యవేక్షించిన మంత్రి నారాయణ కుమార్తె**




నెల్లూరు(ప్రశ్న న్యూస్)నగర విద్యావ్యవస్థలో కార్పొరేట్ విద్యాసంస్థల గుత్తాధిపత్యానికి తెరదించుతూ.. ప్రభుత్వ పాఠశాలలు అంతర్జాతీయ ప్రమాణాలతో సరికొత్త విప్లవానికి శ్రీకారం చుట్టాయి. రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సంకల్పంతో, దాత సుధాకర్ రెడ్డి ఉదారతతో నెల్లూరు 39వ డివిజన్ మూలపేటలో దాదాపు 20 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించిన డీఎస్ఆర్ ప్రభుత్వ హైస్కూల్‌ను మంత్రి కుమార్తె పొంగూరు షరిణి స్వయంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, నెల్లూరులోని 15 ప్రభుత్వ పాఠశాలలను అత్యద్భుతంగా తీర్చిదిద్దే బాధ్యతను మా నాన్నగారు నాకు అప్పగించారని, గతంలో విఆర్ స్కూల్‌కు సెట్ చేసిన స్టాండర్డ్స్ కంటే మిన్నగా ఈ స్కూల్‌ను ముస్తాబు చేశామని సగర్వంగా ప్రకటించారు. ఆక్వా కల్చర్ రైతులతో ఉన్నత స్థాయి సమావేశాన్నీ నిర్వహించిన: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

# రొయ్యల రైతుల సంక్షేమం, ఆక్వాకల్చర్ రంగాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది




అమరావతి(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ఆక్వాకల్చర్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో రొయ్యల రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, సముద్ర ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు తదితర రంగ ప్రతినిధులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రొయ్యల ఫీడ్ ధరల పెరుగుదలపై రైతులు, పరిశ్రమ వర్గాలు తమ అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చాయని మంత్రి తెలిపారు. ఫిష్‌మీల్, సోయాబీన్ తదితర ముడి పదార్థాల ధరలు పెరగడంతో ఉత్పత్తి వ్యయాలు అధికమయ్యాయని తయారీ సంస్థలు వివరించగా, ఇప్పటికే ఖర్చుల భారం పెరిగిన నేపథ్యంలో ధరల పెంపును నియంత్రించాలని రైతులు కోరినట్లు చెప్పారు. ఆక్వాకల్చర్ రంగ సమగ్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైతులు, తయారీదారులు చర్చల ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారానికి రావాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు.

## కేంద్ర, రాష్ట్ర సమన్వయంతో అనంతపురం పర్యాటక రంగానికి వేగవంతమైన అభివృద్ధి: ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



అనంతపురం(ప్రశ్న న్యూస్) నగరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏపీ టూరిజం శాఖ సెంట్రల్ ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ అధికారులతో జిల్లా పర్యాటక అభివృద్ధిపై అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూచనలతో అనంతపురం జిల్లాను రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా గుత్తి కోట అనంతపురం శిల్పారామం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. గుత్తి కోటను చారిత్రక వైభవంతో పాటు సాహస పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. ఇందులో గుర్రపు స్వారీ, గో-కార్టింగ్ ట్రాక్, జిప్ లైన్, ట్రెక్కింగ్, హైకింగ్, టెంట్ స్టేలు, ఏటీవీ రైడ్స్, బర్మా బ్రిడ్జ్, ర్యాపెల్లింగ్ వంటి అడ్వెంచర్ స్పోర్ట్స్‌తో పాటు బాలల ఉద్యానవనం, ఆకర్షణీయమైన ప్రవేశ తోరణం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రవేశ తోరణంను ఎంపీ నిధుల కింద ఏర్పాటు చేస్తామన్నారు.ఈ సమావేశంలో జిల్లా టూరిజం అధికారి ఓబులమ్మ, టూరిజం శాఖ అధికారులు దీపక్, సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ రాజేష్, కన్జర్వేషన్ అసిస్టెంట్ అచ్యుత్ నరహరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నెల్లూరు ప్రజల ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్యం:మంత్రి నారాయణ

**వైద్య రంగంలో సరికొత్త రికార్డు**

**8,400 మందికి పైగా ఉచితంగా**

**నారాయణ నేత్రజ్యోతి, దంత సురక్ష సేవలు**



నెల్లూరు(ప్రశ్న న్యూస్) జిల్లా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేస్తూ రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తన సొంత నిధులతో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నారు. ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్యం అందించడమే ధ్యేయంగా నారాయణ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నారాయణ నేత్రజ్యోతి నారాయణ దంత సురక్ష ఉచిత పరీక్షల వైద్యశిబిరం విజయవంతంగా 3 నెలలు పూర్తి చేసుకుని, ఇప్పటివరకు ఏకంగా 8,400 మందికి పైగా నిరుపేదలకు ఉచిత చికిత్సను అందించింది.సామాన్య ప్రజల పనులకు ఎలాంటి ఆటంకం కలగకూడదనే మానవతా దృక్పథంతో, ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు జరుగుతున్న ఈ మెగా హెల్త్ డ్రైవ్‌ను, 8వ డివిజన్ పరిధిలోని రామచంద్రాపురం, శ్రీదేవి రైస్ మిల్లు దగ్గర అత్యంత విజయవంతంగా నిర్వహించారు. దాదాపు 3 కోట్ల రూపాయల భారీ వ్యయంతో కూడిన హైటెక్ నారాయణ ఆన్ వీల్స్ ద్వారా ఉచితంగా కంప్యూటరైజ్డ్ కంటి, దంత పరీక్షలు చేసి, కేవలం రెండు రోజుల్లోనే సరికొత్త అద్దాలను నేరుగా వారి ఇళ్ల వద్దకే వచ్చి పంపిణీ చేస్తున్నారు. అంతేకాదు, క్యాటరాక్ట్ అవసరమైన రోగులను హాస్పిటల్ వాహనాల్లోనే ఉచితంగా తీసుకెళ్లి కార్పొరేట్ ఆపరేషన్లు పూర్తి చేసి, తిరిగి భద్రంగా ఇళ్లకు చేరుస్తున్నారు.

# తిరుపతి లో ఎన్ డి ఏ కూటమి విజయోత్సవాల సభ

**రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్**

**రెండు సంవత్సరాల సుపరిపాలన -- ప్రజలతో మమేకం**




తిరుపతి (ప్రశ్న న్యూస్)కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జూన్ 12న తిరుపతి నందు బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రజలతో మమేకమై గత 24 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన సుపరిపాలన, చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని ఎన్డిఏ ప్రభుత్వం యోచన చేయడం జరిగిందని జిల్లా ఇంచార్జ్ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఎన్డిఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా తిరుపతిలో దామినేడు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు జూన్ 12 న విచ్చేస్తున్న నేపథ్యంలో మంగళవారం సభా ప్రాంగణం వద్ద ముందస్తు ఏర్పాట్లను జిల్లా ఇంచార్జ్ మంత్రి, జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడుతో కలిసి క్షేత్ర స్థాయిలో సమీక్షించారు.

# అవుట్ సోర్సింగ్ పేరుతో రిటైర్డ్‌లకు మళ్లీ ఉద్యోగాలు

## - యువతకు మూసుకుపోతున్న ఉద్యోగ అవకాశాలు

**- పదవీ విరమణ చేసిన అధికారులకు మళ్లీ అవుట్ సోర్సింగ్ పేరుతో నియామకాలు - ఒకవైపు పెన్షన్, మరోవైపు భారీ వేతనాలు**

**- ఖాళీలు ఉన్నా యువతకు దక్కని ఉద్యోగాలు - రిటైర్మెంట్ ఉద్యోగుల అవుట్ సోర్సింగ్ నియామకాలపై నిరుద్యోగులు ఆగ్రహం**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో అవుట్ సోర్సింగ్ పేరుతో రిటైర్డ్ ఉద్యోగులకు మళ్లీ ఉద్యోగ అవకాశాలు కల్పించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పదవీ విరమణ అనంతరం కూడా వివిధ శాఖల్లో ఒప్పంద ప్రాతిపదికన, అవుట్ సోర్సింగ్ విధానంలో మాజీ అధికారులను తిరిగి విధుల్లోకి తీసుకుంటుండగా, వేలాది మంది నిరుద్యోగ యువత మాత్రం ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితిపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

### - ఇటు పెన్షన్.. అటు జీతం

పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఇప్పటికే ప్రభుత్వ ఖజానా నుంచి నెలవారీ పెన్షన్ పొందుతున్నారు. అదే సమయంలో అవుట్ సోర్సింగ్ విధానంలో తిరిగి నియమితులైతే మరోసారి జీతభత్యాలు, ఇతర సౌకర్యాలు కూడా అందుకుంటున్నారు. దీంతో "ఒకే వ్యక్తికి రెండు చేతులా ప్రభుత్వ డబ్బు" అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### -యువతకు తగ్గుతున్న అవకాశాలు

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఖాళీగా ఉన్న పోస్టులను యువతతో భర్తీ చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అయితే అనేక శాఖల్లో రిటైర్డ్ అధికారులను అవుట్ సోర్సింగ్ ద్వారా కొనసాగించడం వల్ల కొత్త నియామకాలు ఆలస్యమవుతున్నాయని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఒక నిరుద్యోగ యువకుడు మాట్లాడుతూ, "ప్రభుత్వం కొత్త ఉద్యోగాల భర్తీ చేపట్టకుండా రిటైర్డ్ ఉద్యోగులను మళ్లీ నియమిస్తే మా భవిష్యత్తు ఏమవుతుంది?" అని ప్రశ్నించాడు.

### - రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నా అవుట్ సోర్సింగ్ ఎందుకు.?

ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికే శాశ్వత ఉద్యోగులు, సీనియర్ అధికారులు, కార్యనిర్వాహక సిబ్బంది ఉన్నారు. అలాంటప్పుడు రిటైర్డ్ ఉద్యోగులను అవుట్ సోర్సింగ్ పేరుతో తిరిగి నియమించాల్సిన అవసరం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. "వారు లేకుంటే కార్యాలయాల్లో పని జరగదా? ఇప్పటికే ఉన్న వ్యవస్థ సరిపోదా?" అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది అధికారులు మాత్రం అనుభవజ్ఞులైన మాజీ ఉద్యోగుల సేవలు అవసరమని చెబుతున్నారు. ముఖ్యంగా కీలక ప్రాజెక్టులు, పరిపాలనా మార్గదర్శకత్వం, ప్రత్యేక పనుల కోసం వారి అనుభవం ఉపయోగపడుతుందని వాదిస్తున్నారు. అయితే విమర్శకులు దీనిని సమర్థించడం లేదు. "అనుభవం అవసరమే అయితే యువ అధికారులకు శిక్షణ ఇచ్చి బాధ్యతలు అప్పగించాలి" అంటున్నారు.

### - ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం

అవుట్ సోర్సింగ్ పేరుతో రిటైర్డ్ ఉద్యోగులను నియమించడం వల్ల ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతున్నదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒక రిటైర్డ్ అధికారికి ఇచ్చే జీతభత్యాలతో ఇద్దరు లేదా ముగ్గురు యువ ఉద్యోగులను నియమించవచ్చని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. అలా చేస్తే నిరుద్యోగ నిర్మూలనకు కొంతమేర సహాయం అవుతుందని అభిప్రాయపడుతున్నారు.

### - పారదర్శకత ఎక్కడ.?

అవుట్ సోర్సింగ్ నియామకాల ప్రక్రియ పారదర్శకంగా లేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఎవరి సిఫార్సులతో, ఏ ప్రమాణాల ఆధారంగా నియమిస్తున్నారో ప్రజలకు స్పష్టత లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల రాజకీయ అనుబంధాలు, వ్యక్తిగత పరిచయాల ఆధారంగా నియామకాలు జరుగుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### - యువతకు ప్రాధాన్యం ఇవ్వాలి

నిపుణులు, నిరుద్యోగ సంఘాలు ప్రభుత్వానికి ఒకే సందేశం ఇస్తున్నాయి -- ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేసి యువతకు అవకాశాలు కల్పించాలి. రిటైర్డ్ ఉద్యోగుల సేవలు నిజంగా అవసరమైతే పరిమిత కాలానికి మాత్రమే, స్పష్టమైన ప్రమాణాలతో నియమించాలని సూచిస్తున్నారు. ప్రజా ధనం ప్రజల అభివృద్ధికి ఉపయోగపడాలి గానీ, ఒకే వ్యక్తికి పెన్షన్‌తో పాటు మరోసారి జీతం చెల్లించే విధానం పునర్విమర్శించాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఫ్లెక్సీలకు ఫుల్‌స్టాప్..

# అనుమతి తప్పనిసరి

**గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కీలక హెచ్చరిక**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్--ప్రజ్ఞాపూర్ పురపాలక సంఘ పరిధిలో ఇకపై అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. పట్టణంలోని రహదారులు, డివైడర్లు, భవనాలపై ప్రకటనలు ఏర్పాటు చేయాలనుకునే వ్యాపారులు, వాణిజ్య సముదాయాల యజమానులు, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ముందుగా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అనుమతి లేకుండా ప్రకటనలు ఏర్పాటు చేసిన వారిపై తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం--2019 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ సౌందర్యాన్ని కాపాడడం, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడడం, ప్రజా ఆస్తుల సంరక్షణే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని మున్సిపల్ అధికారులు వెల్లడించారు. ప్రజలు, వ్యాపార వర్గాలు నిబంధనలు పాటించి మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# గౌహతిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి ముందడుగు : టిటిడి

**10.33 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్న టీటీడీ**

**ఈశాన్య భారతంలో సనాతన ధర్మ ప్రచారానికి కొత్త అధ్యాయం**

**త్వరలో భూమిపూజ -- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు**



తిరుపతి (ప్రశ్న న్యూస్ ) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు దేశవ్యాప్తంగా రాష్ట్ర రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా అస్సాం ప్రభుత్వం కేటాయించిన 10.33 ఎకరాల భూమిని టీటీడీ మంగళవారం అధికారికంగా స్వాధీనం చేసుకుంది.అస్సాం రాష్ట్రంలోని కామ్రూప్ జిల్లాలోని సోనాపూర్ సర్కిల్ పరిధిలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ నిర్మాణం కోసం ఈ భూమిని అస్సాం ప్రభుత్వం కేటాయించింది. గతంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఉన్నతాధికారులు అస్సాం ప్రభుత్వ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి ఆలయ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీటీడీ పాలకమండలి కూడా అస్సాం ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖలు రాశారు.ఈ నేపథ్యంలో టీటీడీ ఎస్టేట్ అధికారి సువర్ణమ్మ, ఈఈ సురేంద్ర రెడ్డికి అస్సాం మెట్రోపాలిటన్ డిప్యూటీ కమిషనర్ మంగళవారం ల్యాండ్ పొజెషన్ సర్టిఫికెట్‌ను అందజేశారు.

### త్వరలో భూమిపూజ..

గౌహతిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి త్వరలో భూమిపూజ నిర్వహించనున్నట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో ఈ ప్రక్రియ వేగవంతమై సఫలమవడం ఆనందదాయకమన్నారు.అస్సాంలో శ్రీవారి ఆలయ నిర్మాణం ఈశాన్య భారతంలో సనాతన ధర్మ ప్రచారానికి, ఆధ్యాత్మిక చైతన్య విస్తరణకు ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుందని ఆయన పేర్కొన్నారు.ఈ మహత్తర కార్యక్రమానికి సహకరించిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కి, అస్సాం ప్రభుత్వానికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర టీటీడీ తరపున కృతజ్ఞతలు తెలిపారు

# గజ్వేల్‌లో వక్ఫ్ బోర్డు భూములలో అక్రమ నిర్మాణాలు

**- టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ దీపిక మౌనం వెనుక కారణం లంచాల.?**

**- సర్వే నెంబర్ 400 లో అనుమతులు లేకుండా అడ్డగోలుగా నిర్మాణాలు**

**- మాజీ కమిషనర్ వెంకట గోపాల్ కనుసైగల్లో నిర్మాణ పనులు**

**- మున్సిపల్, రెవిన్యూ అధికారుల మామూళ్ల దందా.?**

**- వక్ఫ్ బోర్డు భూముల కబ్జాలో అధికారుల పూర్తి సహకారం**

**- వక్ఫ్ బోర్డు భూముల కబ్జాలో మూతవల్లీ కి కాసుల పంట**



గజ్వేల్ మాజీ మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్

### లంచాలలో మునిగి తేలుతున్న రెవెన్యూ అధికారులు..

గజ్వేల్ నియోజకవర్గం లో రెవిన్యూ శాఖ పాత్ర కూడా ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన అధికారులే మౌనం వహించడం వెనుక లంచాల వ్యవహారం ఉందా.? అనే అనుమానం వ్యక్తమవుతోంది. భూముల రికార్డులు మార్పులు, సర్వే లోపాలు, ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం చేయడం అన్ని కలిసి ఆక్రమణదారులకు అనుకూల పరిస్థితులు సృష్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (ప్రశ్న న్యూస్) గజ్వేల్ నియోజకవర్గంలో వక్ఫ్ బోర్డు భూములు క్రమంగా కనుమరుగవుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కోట్ల విలువైన ఈ భూములు ఎలాంటి అనుమతులు లేకుండా ఆక్రమణలకు గురవుతూ, అక్రమ నిర్మాణాలు వేగంగా పెరుగుతున్నాయి. బాధ్యత వహించాల్సిన అధికార యంత్రాంగం మాత్రం మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికంగా అందుతున్న సమాచారం ప్రకారం, 16వ వార్డు సర్వేనెంబర్ 400 లో వక్ఫ్ బోర్డు భూములపై కొందరు కబ్జా చేసి ఇలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి, అసలు అనుమతులు లేకుండా దుకాణాలు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనక లంచాలే కారణం అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇలాంటి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన మున్సిపల్ కమిషనర్ కార్యాలయం పూర్తిగా అవినీతి అక్రమాలను నిర్లక్ష్యంను ప్రదర్శిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మాజీ కమిషనర్ వెంకట గోపాల్, ప్రస్తుత సెక్షన్ ఆఫీసర్ దీపిక భారీ స్థాయిలో లంచాలు తీసుకొని పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం ప్రజల్లో ఆగ్రహానికి కలిగిస్తోంది.



### మూతవల్లీ తను సైగల్లో వర్క్ బోర్డ్ భూములు స్వాహా

గజ్వేల్ నియోజకవర్గంలో అత్యంత ఆందోళన కలిగిస్తున్న విషయం ఏమిటంటే మూతవల్లిలా రక్షణలో ఉండాల్సిన భూములు భక్షనకు గురికావడం వెనక వాళ్ల హస్తం ఉందని వక్ఫ్ బోర్డు రక్షణలో ఉండాల్సిన భూముల నిబంధనల, పాలకుల లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొంతమంది ముతావల్లీలు, సిబ్బంది భారీగా లంచాలు తీసుకొని ఆక్రమణదారులకు పూర్తిగా సహకరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అంతర్గతంగా జరుగుతున్న ఈ అవినీతి సహకారం వల్లే భూములు వేగంగా కబ్జా అవుతున్నాయని స్థానిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికైనా గజ్వేల్ మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వో, ఉన్నతాధికారులు స్పందించి, గజ్వేల్ పరిధిలోని వక్ఫ్ భూములపై ప్రత్యేక సర్వే నిర్వహించి కబ్జా చేసిన నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వక్ఫ్ భూములు మతపరమైన, సామాజిక అవసరాలకు ఉపయోగపడాల్సిన ఆస్తులు. అలాంటి భూములు కొందరి స్వార్థానికి బలి కావడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం. మూతావల్లీ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి వక్ఫ్ బోర్డు భూముల కబ్జాలను అరికట్టకపోతే, భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయిలో నష్టం సంభవించే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైన అధికారుల చర్యలు ఉంటాయా.? లేక విధి నిర్వహణలో నిర్లక్ష్యం, మౌనం కొనసాగుతుందా.? అనేది చూడాల్సిందే.

# అక్రమ కలప నిల్వలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

**- 35 కలప దుంగలు స్వాధీనం.. అటవీశాఖకు అప్పగింత**

**- టాస్కోఫర్స్ ఇన్స్పెక్టర్ : నటేష్**





భీంగల్ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలంలోని గజసింగవరం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన కలప దుంగలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి 35 కలప దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నటేష్ తెలిపిన వివరాల ప్రకారం, గజసింగవరం గ్రామానికి చెందిన చంద్రమౌళి (బాలకిష్టయ్య కుమారుడు) తన ఇంటి ఆవరణలో అటవీశాఖ నిబంధనలకు విరుద్ధంగా కలప దుంగలను నిల్వ ఉంచినట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 35 కలప దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న కలపను తదుపరి చర్యల కోసం అటవీశాఖ సెక్షన్ అధికారి పద్మాలతకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. అక్రమంగా కలప నిల్వలు, రవాణా చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ సంపద పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుళ్లు తిరుపతి, ఉమాపతి, రాజేష్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588